రానున్న 24 గంటల్లో..


నిజాంపట్నం వద్ద ఆరు మీటర్లు ముందుకు వచ్చిన సముద్రం

కమాండ్ కంట్రోల్ రూం నంబర్లు
- కలెక్టరేట్: 0863-2234014
- ఎస్పీ కార్యాలయం: 0863-2230100
- తెనాలి: 08644-225829

ముంచుకొస్తున్న మొంథా

- నేటి రాత్రి తీరం దాటనున్న తుపాను
- ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో మొదలైన వర్షాలు
- సహాయ చర్యలకు యంత్రాంగం సన్నద్ధం
- నిజాంపట్నంలో 6 మీటర్లు ముందుకొచ్చిన సముద్రం
- హార్బర్‌లో 3వ ప్రమాద హెచ్చరిక

తెనాలి, గుంటూరు అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావం మొదలైంది. సోమవారం ఉదయం నుంచే గుంటూరు, బాపట్ల, పల్నాడు జిలాల్లో వర్షాలు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం నుంచి ఆకాశం చీక ట్లు కమ్మేసింది. బాపట్ల, గుంటూరు జిల్లాలకు రెడ్ అలెర్ట్, పల్నాడు జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ హెచ్చరికలను ఇప్పటికే విపత్తుల శాఖ జారీ చేసింది. మొంథా కాకినాడ తీరానికి దగ్గరవుతున్న కొద్దీ ఉమ్మడి జిల్లాల్లో వాతావరణం పూర్తిగా మారుతూ వస్తోంది. రాత్రి గాలులు లేకుండా తుపాన్ ముందు ప్రశాంతత కనిపించింది. తీర గ్రామాల్లో మాత్రం 20 నుంచి 30 కిలోమీటర్ల వేగంతో మోస్తరు గాలులు మినహా పెద్దగా అలజడి కనిపించలేదు. వర్షం మాత్రం విరామం లేకుండా పడుతూనే ఉంది. ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో శని, ఆదివారాల్లోనే మున్సిపాలిటీ లు, నగర పంచాయతీల్లో ప్రధాన డ్రెయిన్ల పూడిక తొలగించారు. తెనాలి, మంగళగిరి, తాడేపల్లి, పొన్నూరు, రేపల్లె, బాపట్ల మున్సిపాలిటీల్లో వర్షంలోనూ పూడికతీత పనులు చేస్తూనే ఉన్నారు. గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని కూడా ఏర్పాటు చేశారు. ముంపు సమస్య లేకుండా చూస్తున్నారు. మంగళవారం రాత్రికి కాకినాడ తీరం వద్ద తుపాను తీరం దాటనుంది. ఈ నేపథ్యంలో తుపాను ప్రభావం మూడు రోజులు ఉంటుందని ప్రభుత్వం హెచ్చరికలు చేయడంతో జనం అన్ని రోజులకు సరిపడా సరకులు, కూరగాయలు సమకూర్చుకునేందుకు దుకాణాలకు బారులు తీరారు. దీంతో కూరగాయల ధరలను పట్టణ ప్రాంతాల్లో పెంచేశారు. రాత్రి వరకు వర్షం మాత్రమే పడుతుండటం, గాలుల తీవ్రత లేకపోవడంతో ప్రస్తుతానికి ఈ జిల్లాల వాసులు ఊపిరి పీల్చుకున్నారు. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో గుంటూరు, బాపట్ల జిల్లాల కలెక్టర్లు, ప్రత్యేక అధికారులు పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. లోతట్టు ప్రాంతాలు, తీర ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలు, షెల్టర్లు, సురక్షిత భవనాల్లోకి తరలించాలని అధికారులను ఆదేశించారు. ఈ జిల్లాల్లో అంచనా వేసినంత వర్షపాతం నమోదయితే, సమస్యలు లేకుండా చూ సేందుకు యంత్రాంగం సమాయత్తం అయింది.

వరి రైతు 'వెన్ను'లో వణుకు!

గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని కృష్ణా పశ్చిమ డెల్టాలో 5.71 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ కింద వరి సాగవుతోంది. గుంటూరు జిల్లాల్లోని డెల్టా ప్రాంతంలో ఖరీఫ్ సీజన్‌లో 61,257 హెక్టార్లలో వరి సాగు చేశారు. పత్తి 25,205 హెక్టార్లలో సాగవు తోంది. తీవ్ర అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు చాలాచోట్ల వరి నేల వాలింది. తుపాన్ ఏ మేరకు పంటను దెబ్బతీస్తుందనే భయం రైతుల్లో మొదలైంది.

తక్షణం పునరావాస కేంద్రాలకు తరలించాలి : కలెక్టర్

గుంటూరు: ప్రమాదం జరిగే అవకాశాలు ఏమాత్రం ఉన్నా తక్షణం అక్కడి నుంచి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని కలెక్టర్ అన్సారియా అధికారులను ఆదేశించారు. మొంథా తుఫాన్ దృష్ట్యా అధికారులతో ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. మంగళగిరి కొత్తపేట, కొలకలూరు బకింగ్‌హాం కాలువ, ఆత్మకూరు వద్ద నివాసాలు ఉన్నారని వారిని పునరావాస కేంద్రాలకు తరలించినట్లు చెప్పారు. పూరి గుడిసెలు, తాత్కాలిక గుడారాలు, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఎవరు ఉండరాదని స్పష్టం చేశారు. ప్రజలు ఇంటి వద్దనే ఉండాలని విజ్ఞప్తి చేశారు. మూడు రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు సిద్ధంగా ఉంచుకోవాలని కోరారు. కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూం 0863-2234014 నంబరుతో పాటు డివిజన్, మండల స్థాయి కంట్రోల్ రూం నంబర్లకు సహాయక చర్యలు, తుపాను సమాచారాన్ని తెలియజేయవచ్చన్నారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకూడద అధికారులకు స్పష్టం చేశారు. పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని చెప్పారు.


తెనాలి వద్ద వరి పొలాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

కూరగాయలకు కృత్రిమ ధర..

గుంటూరు: మొంథా తుపాను హెచ్చరికల నేపథ్యంలో గుంటూరులో కూరగాయలకు డిమాండ్ ఏర్పడింది. మూడు రైతు బజార్లలో రెట్టింపు ధరలకు వ్యాపారులు విక్రయించారు. మూడు రోజుల క్రితం కేజీ టమాట ధర రూ.20 ఉండగా.. రూ. 40కి పెంచారు. ఇది చూసి బయటి మార్కెట్లలో రూ. 50 నుంచి రూ.60కి విక్రయించారు. రూ.50లోపే ఉన్న క్యారెట్ రూ.75కు విక్రయించారు.



మూడో నంబరు ప్రమాద హెచ్చరిక

మొంథా తుపాను ధాటికి నిజాంపట్నం వద్ద సముద్ర తీరం అల్ల కల్లోలంగా మారింది. హార్బర్‌లో 3వ నంబరు ప్రమాద హెచ్చరికను ఎగురవేశారు. ఆదివారం వరకు ఒకటవ ప్రమాద హెచ్చరికను ఎగురవేస్తే.. ఉదయం నుంచి 3వ హెచ్చరికకు మార్చారు. సముద్రంలో వేటకు వెళ్లిన పడవలన్నీ తుపాన్‌కు ముందే ఒడ్డుకు చేరాయి. బాపట్ల జిలాల్లోని నిజాంపట్నం, సూర్యలంక తీరంలో సముద్రం అలలు 7 నుంచి 8 అడుగుల మేర ఎగసిపడుతున్నాయి. సముద్రం 6 మీటర్ల వరకు ముందుకు వచ్చింది. ఐదురోజులుగా జెట్టీలకే పరిమితమైన బోట్లలోనే మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారు. అలల ఉధృతి విపరీతంగా ఉండడంతో కాకినాడకు చెందిన మొరైన్‌బోటు నిజాంపట్నం హార్బర్‌కు చేరుకుంది. పునరావస కేంద్రాలు, తుపాను షెల్టర్లు వద్ద అధికారులు ఎవరూ కనిపించడం లేదు.

- బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేం ద్రంలో ప్రజలతో మాట్లాడుతున్నకమిషనర్ జి.రఘునాథరెడ్డి




నిజాంపట్నం హార్బర్‌లో నిలిచిన బోట్లు


నిజాంపట్నం సముద్రం వద్దకు ఎవరూ వెళ్లరాదని హెచ్చరిక బోర్డు


సూర్యలంక తీరం ఒడ్డున ఉన్న ఎన్డీఆర్ఎఫ్ బృందం


సూర్యలంక సముద్రంలోకి వెళ్లకుండా మూసేసిన గేట్లు


నిజాంపట్నం హార్బర్‌లో బోట్లు, వలలను శుభ్రం చేసుకుంటున్న మత్స్యకారులు

కార్తీక..శోభ





గుంటూరు(తూర్పు), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆలయాలు కార్తీక శోభతో వెలిగిపోయాయి. కార్తీక మాసం తొలి సోమవారం శివాలయాల్లో స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు జరిగాయి. రవీంద్రనగర్, కొత్తపేట, అరండల్‌పేట, బ్రాడీపేట, ఆర్.అగ్రహారం, పాతగుంటూరు, బృందావన్ గార్డెన్స్ ఆలయాల్లో భక్తులు స్వామి వార్లను దర్శించుకున్నారు. ఉపవాస దీక్షలు చేసిన భక్తులు సాయంత్రం దేవాలయాల్లో జరిగిన ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు.


అరండల్‌పేట శివాలయంలో దీపాలను వెలిగిస్తున్న మహిళలు


ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వర స్వామి

సురక్షిత గమ్యం ప్రధాన లక్ష్యం

ఎస్పీ వకుల్ జిందాల్ ● స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన మైనర్ల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యం చేరాలనేదే ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రోడ్డు భద్రత నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులకు అవగాహన కల్పించేందుకు రెండు రోజుల స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిరచిన 805 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అందులో గుంటూరు నగరానికి చెందినవి 313 వాహనాలు ఉన్నాయి. సోమవారం పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై అవగాహన సద స్సులో ఎస్పీ వకుల్ జిందాల్ వాహనదారు లకు, మైనర్ల తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. ఏటా రోడ్డు ప్ర మాదాల్లో సుమారు రెండు లక్షల మంది మరణిస్తున్నారని, ఎంతో మంది గాయపడు తున్నారని పేర్కొన్నారు. కేవలం రోడ్డు భద్రతా నియమాలు తెలుసుకోకపోవడం, ట్రాఫిక్ నిబం ధనలను పాటించకపోవడం వల్లనే ఈ ప్రమాదాలు జరు గుతున్నాయని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రెండు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక వాహన డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. మైనర్, ర్యాష్, ట్రిపుల్ రైడింగ్ వాహనాలను స్వాధీనం చేసుకుని.. వారందరికీ కౌన్సెలింగ్ నిర్వహించాలనే ఉద్దేశంతో పిలిపించడం జరిగిందన్నారు. అంతే తప్ప ఎవరిని ఇబ్బంది పెట్టడం, జరిమానాలు విధించడం తమ ఉద్దేశం కాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరే విధంగా చూడడమే పోలీసుల ఉద్దేశమన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 805 వాహనాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. అందులో మైనర్ డ్రైవింగ్ - 141, ర్యాష్ డ్రైవింగ్/బైక్ రేసింగ్ - 98, ట్రిపుల్ రైడింగ్ - 218, నంబర్ ప్లేట్ లేనివి - 115, హెల్మెట్, లైసెన్స్, సరైన పత్రాలు లేనివి - 230 ఉన్నాయన్నారు. తల్లిదండ్రులు ఇప్ప టికైనా.. తమ మైనర్ బిడ్డల భద్రతను దృష్టిలో పెట్టుకొని వారికి వాహనాలను ఇవ్వరాదని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు బెల్లం శ్రీనివాసరావు, అరవింద్, అబ్దుల్ అజీజ్, ఎస్‌టీ సీఐ అలహరి శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐలు అశోక్‌కుమార్, సింగయ్య, కొత్తపేట సీఐ వీరయ్యచౌదరి, లాలాపేట, నగరంపాలెం సీఐలు శివప్రసాద్, కిశోర్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.


మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

కడలిలోకి .. కృష్ణమ్మ పరుగులు

- 'జల ఆశయాలు' దాటి.. వరద ప్రవాహం
- సంద్రంలో కలిసిన 1,466.7 టీఎంసీలు
- 18 ఏళ్లలో రికార్డు స్థాయిలో నదికి వరద
- నిండు కుండలా ప్రాజెక్టులు కళకళ

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

కృష్ణమ్మ సాగర్ అయకట్టులో పరుగులిడుతోంది. పంటల సాగుకు పుష్కలంగా నీటిని అందిస్తోంది. దీంతో లక్షలాది ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అన్నదాతల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. నాగార్జున సాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీకు కృష్ణమ్మ పోటెత్తింది. 18 ఏళ్లలో రికార్డు స్థాయిలో కృష్ణా నదికి వరద వచ్చింది. ఇప్పటి వరకు 1,466.7 టీఎంసీల వరద నీరు కడలిలో కలిసిపోయింది. జూలైలో ప్రారంభమైన వరద ప్రవాహం కొనసాగుతూనే ఉంది.

అక్టోబరులో రికార్డు స్థాయిలో సాగర్ ప్రాజెక్టు నీటి నిల్వ ఉండటం విశేషం. దిగువన ఉన్న జలాశయాలు నిండుకుండలా కళ కళాడుతున్నాయి. సాగర్ కుడి కాలువకు నీటిని పూర్తిస్థాయిలో సరఫరా చేస్తున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లా ల్లోని కుడి కాలువ అయకట్టులోని 11.11 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. వచ్చే ఏడాదికి కూడా సాగు నీరుకు ఢోకా ఉండదని, వరద ప్రవాహం ఇంకొన్ని రోజులు కొనసాగవచ్చని జలవనరుల శాఖ అధికారుల అంచనా.

సముద్రంలో కలసిన కృష్ణా జలాలు (ఈ నెల 27వరకు)

నెల	నీరు టీఎంసీలలో
ఆగస్టు	639.47
సెప్టెంబరు	573.87
అక్టోబరు	253.36

నిండు కుండలా సాగర్..

సాగర్ (మిగతా 8వ పేజీలో)

నేడు, రేపు మిర్చియార్డుకు సెలవులు

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావం దృష్ట్యా ముందస్తు జాగ్రత్తగా ఈ నెల 28, 29 తేదీలు మంగళ, బుధవారాలలో మిర్చియార్డుకు సెలవు ప్రకటించినట్లు జీఏఎంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణశాఖ హెచ్చరికలను పరిగణనలోకి తీసుకొని రైతులు, ట్రేడర్లు, కార్మికులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు సెలవులను ప్రకటించామన్నారు. కేవలం మిర్చి లావాదేవీలు మాత్రమే జరగవని, మార్కెట్ కమిటీ పరిపాలన కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయని చెప్పారు. ఈ విషయాన్ని రైతులు, ట్రేడర్లు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

ప్లాట్ల క్రమబద్ధీకరణ గడువు 3 నెలలు పొడిగింపు

గుంటూరుకార్పొరేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అక్రమ లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం విధించిన గడువును మరో మూడు నెలలు పొడిగించారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ నిర్ణయం తీసుకుంటూ ప్రభుత్వ ఆమోదంతో ఉత్తర్వులు జారీ చేసింది.

జాబ్ మేళా వాయిదా

నరసరావుపేట టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన నిర్వహించ తలపెట్టిన జాబ్ మేళాను నవంబరు 11కు వాయిదా వేసినట్లు జిల్లా నైపుణ్యాధికారి ఈ తమ్మాజీ సోమవారం తెలిపారు. అభ్యర్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని వాయిదా వేశామన్నారు. మరింత సమాచారం కోసం 9642194600, 9573247861, 8121360425, 9160200652 నంబర్లను సంప్రదించాలన్నారు.

రవికుమార్‌కు పీహెచ్‌డీ ప్రదానం




ఏఎన్‌యూ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో రవికుమార్ బొప్పనకు పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు సోమవారం రీసెర్చ్ సెల్ కో- ఆర్డినేటర్ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరిశోధన పర్యవేక్షకులుగా ఆర్.శివరామ ప్రసాద్ ఉన్నారు. 'సోషల్ మీడియా మేనేజ్‌మెంట్ స్ట్రాటజీస్ అండ్ ఇట్స్ ఇంపాక్ట్ ఆన్ ట్రెడిషనల్ మీడియా-యాన్ అనాలిసిస్.' అనే అంశంపై రవికుమార్ పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకుగాను పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు తెలిపారు. రవికుమార్ ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌కు మీడియా లైజన్ ఆఫీసర్‌గా, అలాగే గవర్నర్‌కు చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా పనిచేశారు. ప్రస్తుతం వివిధ ప్రభుత్వ శాఖలకు మీడియా సమన్వయకర్తగా ఉన్నారు. ఈ సందర్భంగా పరిశోధకులు, విద్యార్థులు రవికుమార్‌కు అభినందనలు తెలిపారు.

జిల్లా పరిషత్ మీటింగ్ జరిగేనా..!

గుంటూరు సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను నేపథ్యంలో ఈ నెల 29 బుధవారం రోజున జరగనున్న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. తుఫాన్ తీవ్రత నేపథ్యంలో అసలు సర్వసభ్య సమావేశం జరుగుతుందా, లేదా అన్న ప్రశ్న ఉద్భవిస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ప్రజా ప్రతినిధులు రావా ల్సి ఉండగా వర్ష ప్రభావం వల్ల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని బావిస్తున్నా రు. తుఫాన్ తీవ్రత గుంటూరు, బాపట్ల జిల్లాల్లోనే ఎక్కువగా ఉంటుందన్న నేపథ్యం లో సమావేశం నిర్వహణపై అనుమానం వ్యక్తం అవుతుంది. సమావేశం తేదీ ప్రక టించారు కాబట్టి రద్దు చేసే అవకాశం ఉండదని, ఒక వేళ తగినంత మంది జడ్‌పీటీ సీలు హాజరు కాకపోతే కోరం లేనందున వాయిదా వేసే అవకాశం ఉంటుందని తెలుస్తుంది.

రూ.35.71 కోట్లు పోయినట్లేనా..!



(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

- జడ్పీకి రావాల్సిన సర్‌చార్జిపై అనుమానాలు
- గతంలో నేరుగా స్థానిక సంస్థల ఖాతాలో జమ
- సీఎఫ్ఎంఎస్ వచ్చాక రాష్ట్రం చేతుల్లోకి
- అక్కడ నుంచి రావటం ఇక గగనమే

పరిపాలనలో సంస్కరణల పేరుతో ప్రభుత్వాలు తీసుకుంటున్న కొత్త నిర్ణయాలు స్థానిక స్వపరిపాలన సంస్థల నడ్డి విరుస్తున్నాయి. ఒకప్పుడు నేరుగా స్థానిక సంస్థల ఖాతాల్లో జమయ్యే సర్‌చార్జి కూడా సీఎఫ్ఎంఎస్ (సెంట్రల్ ఫండ్స్ మేనేజ్‌మెంట్ సిస్టం)కు వెళ్లటం పెను శాపంలా పరిణమించింది. జగన్ జమానాలో సీఎఫ్ఎంఎస్‌కు వెళ్లిన నిధులు తిరిగి స్థానిక సంస్థలకు రాకపోవటంతో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ రూ. 35.17 కోట్లు నష్టపోవాల్సిన దుస్థితి దాపురించింది. ప్రస్తుత ప్రభుత్వం అయినా ఆ సమస్యపై దృష్టి సారించి పరిష్కారం చూపుతుందన్న ఆశ రోజురోజుకు అడగంటుతోంది.

● గతంలో చెల్లింపులు స్థానికంగానే..

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌కు ప్రధాన ఆదాయ వనరుల్లో స్టాంప్స్ రిజిస్ట్రేషన్‌శాఖ నుంచి వచ్చే సర్‌చార్జి (ట్రాన్స్ఫర్ డ్యూటీ) అత్యంత ప్రధానమైంది. గతం లో ఈ చెల్లింపులు స్థానికంగానే జరిగేవి. కాబట్టి పెద్దగా పెండింగ్‌లు ఉండేవి కావు. సీఎఫ్ఎంఎస్ వచ్చిన తర్వాత పరిస్థితి మారిపోయింది. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారి వద్ద నుంచి వసూలు చేసే సర్‌చార్జి నేరుగా సీఎఫ్ఎంఎస్‌కు వెళ్తుంది. దానిని ఆర్థికశాఖ అధికారులు పరిశీలించి విడుదల చేయాలి. 2014-2019 మధ్య ఆ చెల్లింపులు సక్రమంగానే జరిగాయి. 2019లో ప్రభుత్వం మారిన తర్వాత సీఎఫ్ఎంఎస్‌కు వెళ్లిన సర్‌చార్జ్‌ను కూడా ప్రభుత్వం వాడుకోవటం ఆరంభించింది. ఆ సొమ్ము స్థానిక సంస్థలకు విడుదల చేయటానికి సినిమా చూపిస్తూ వచ్చింది. ఆ రకంగా గుంటూరు జిల్లా పరిషత్‌కు రావాల్సిన సర్‌చార్జి కోట్లలో పేరుకు పోయింది. కూటమి ప్రభుత్వం కూడా గడచిన 16 నెలలుగా ఆ ఊసే ఎత్తటం లేదు.

రావాల్సింది రూ.35.17 కోట్లు

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌కు సర్‌చార్జ్ రూపేణా రావాల్సిన సొమ్ము వివరాలు ఇలా ఉన్నాయి. బాపట్ల జిల్లా నుంచి 2022-2023లో రూ.46 లక్షలు, 2024-2025లోరూ.1.15 కోట్లు, 2025-2026లో రూ.57 లక్షలు రావాల్సి ఉంది. పల్నాడు జిల్లా నుంచి 2024-2025 లో రూ.5.57 కోట్లు, 2025-2026లో 5.62 కోట్లు, గుంటూరు జిల్లాలో 2022-2023లో రూ.7.60 కోట్లు, 2024-2025లో 10.90 కోట్లు, 2025-2026లో 5.62 కోట్లు జిల్లా పరిషత్‌కు రావాల్సి ఉంది. మొత్తం సుమారుగా రూ.35.17 కోట్లు సర్‌చార్జి సొమ్ము రావాల్సి ఉందని జిల్లా పరిషత్ అధికారులు చెబుతున్నారు.

సీఎం, మంత్రులను కలిశాను



ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌కు రావాల్సిన సర్‌చార్జి నిధులను విడుదల చేయాలని కోరుతూ ముఖ్యమంత్రిని కలిసి వినతి పత్రం అందజేశాను. ఆ తర్వాత రాష్ట్ర మంత్రులను కూడా కలిసి అదే విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లాను. జిల్లాలో చాలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఆ నిధులు వస్తేనే కానీ పనులు జరిగే పరిస్థితి కనబడడం లేదు. కాబట్టి ప్రభుత్వం జడ్పీకి రావాల్సిన సర్‌చార్జిను వెంటనే విడుదల చేస్తుందని ఆశిస్తున్నాను.

-కత్తెర హెనీ క్రిస్టీనా, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, గుంటూరు

కొనసాగుతోన్న వరద ఉధృతి


తాడేపల్లి టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 69,630 క్యూసెక్కుల వరద నీరు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరుతోందని ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు ఆయన చెప్పారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 11.8 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా డెల్టా కాలువలకు నీటి విడుదల నిలిపివేసినట్టు జేఈ తెలిపారు.



ప్రకాశం బ్యారేజీ దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

1.0921 ఎంయూల విద్యుత్ తయారీ

రెంటచింతల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సత్రశాల నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో ఆదివారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0921 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు చెప్పారు. ప్రాజెక్టుకున్న 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 2 గేట్లను 1.50 మీటర్ల మేర, 1 గేట్‌ను 2 మీటర్ల మేర ఎత్తి 24,116 క్యూసెక్కులు, టేల్‌రేస్ చానల్ ద్వారా 8,650 మొత్తంగా 32,766 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన ఉన్న సాగర్, ఎత్తిపోతల జలపాతం, హాలియా వాగుల నుంచి 32,762 క్యూసెక్కుల నీరొస్తోందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఇది 7.080 టీఎంసీలకు సమానమని చెప్పారు. ఇప్పటివరకు 58 ఎంయూల విద్యుత్ తయారైందని తెలిపారు.



టేల్ రేస్ చానల్ ద్వారా విడుదలవుతున్న నీరు

గుంటూరులో మూడేళ్ల బాలుడి కిడ్నాప్

- రూ.6 లక్షలు డిమాండ్
- సాంకేతిక పరిజ్ఞానంతో కేసు ఛేదన

గుంటూరుకార్పొరేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల బాలుడిని కిడ్నాప్ చేసి, వదిలేందుకు రూ.ఆరు లక్షలు డిమాండ్ చేసి లేదంటే చంపేస్తానని బెదిరించిన మహిళను



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న గుంటూరు ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, పాత గుంటూరు సీఐ వెంకట ప్రసాద్

పాత గుంటూరు పోలీసులు అరెస్టు చేశారు. బాలుడిని తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు. పోలీసుల వివరాల ప్రకారం, తన మూడేళ్ల కుమారుడు కిడ్నాప్‌కు గురయ్యాడని గుంటూరు ఆర్టీసీ కాలనీకి చెందిన షేక్ షఫివుల్లా పాత గుంటూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పాత గుంటూరు సీఐ వెంకట ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. షఫివుల్లాకు వదిన అయినా పటాన్ షకీలా అప్పులపాలై తన తండ్రి ఇంట్లో వారం రోజులుగా ఉంటోంది. అప్పుల నుంచి బయటపడేందుకు షఫివుల్లా కుమారుడైన మూడేళ్ల బాలుడిని కిడ్నాప్ చేయాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం సమయంలో బాలుడిని కిడ్నాప్ చేసింది. చెన్నైలో ఉన్న బాలుడి అన్న షేక్ షహితుల్లాకు ఫోన్ చేసి బాలుడిని కిడ్నాప్ చేశానని, తనకు రూ.6 లక్షలు ఇస్తే వదిలేస్తానని, లేకపోతే చంపేస్తానని బెదిరించింది. దీంతో షహితుల్లా ఫోన్ చేసి షకీలా బెదిరించిన విషయాన్ని బాలుడి తండ్రి షఫివుల్లాకు తెలిపారు. షఫివుల్లా పాత గుంటూరు పోలీసులను ఆశ్రయించారు. వెంటనే అప్రమత్తమైన సీఐ వెంకట ప్రసాద్ సాంకేతిక పరిజ్ఞానంతో గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. బాలుడిని ఆమె చెర నుంచి విడిపించి తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితురాలు షకీలాను కోర్టులో హాజరు పరిచినట్లు డీఎస్పీ తెలిపారు.

ఆర్టీసీపై తుఫాన్ ఎఫెక్ట్

- సగం మంది ప్రయాణికులతో పలు సర్వీసుల రాకపోకలు
- నేడు, రేపు పలు సర్వీసులు రద్దు
- డీపీటీవో సామ్రాజ్యం

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆర్టీసీపై మొంథా తుఫాన్ ప్రభావం సోమవారమే కనిపించింది. సగం మంది ప్రయాణికులతోనే పలు సర్వీసులు రాకపోకలు సాగించాయి. గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్ ప్రయాణికుల్లేక వెలవెలబోయింది. అలాగే గుంటూరుతో పాటు మంగళగిరి, తెనాలి, పొన్నూరు డిపోల్లోనూ అడపా దడపా ప్రయాణికులతోనే సర్వీసులు రాకపోకలు సాగించాయి. దాంతో పలు బస్సు సర్వీసులను కూడా తగ్గించుకోవాల్సి వచ్చింది. మంగళ, బుధవారాల్లో మొంథా తుఫాన్ హెచ్చరికలతో ఆర్టీసీ యంత్రాంగం అప్రమత్తమైంది. గుంటూరు ప్రజా రవాణాధికారిగా (డీపీటీవో) సోమవారమే బాధ్యతలు స్వీకరించిన డి.సామ్రాజ్యం వెను వెంటనే తుఫాన్ ప్రభావంపై అధికారులతో సమీక్షించారు. డిపోల వారీగా మేనేజర్లతో రూట్‌ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రూట్‌ల వారీగా సమీక్షించిన డీపీటీవో అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ముఖ్యంగా తుఫాన్ ప్రభావం మంగళ, బుధవారాలు అత్యధికంగా ఉంటుందని ఇప్పటికే వాతావర ణశాఖ ప్రకటించటంతో గుంటూరు-1, 2 డిపోల నుంచి మంగళగిరి, తెనాలి, పొన్నూరు డిపోలలో కూడా సర్వీసులను తగ్గిస్తున్నట్లు డీపీటీ వో తెలిపారు. తుఫాన్ ప్రభావంతో ప్రజలు కూడా ప్రయాణాలను వాయిదా వేసుకుంటున్నారని, తద్వారా రద్దీ ఉండటం లేదని దాంతో సర్వీసులను తగ్గిస్తున్నట్లు చెప్పారు. ఇక బస్సుల రాకపోకలు సాగించే అమరావతి రూట్, తెనాలి, బాపట్ల, పర్చూరు, మాచర్ల వంటి రూట్ లలో రహదారుల పరిస్థితి, చప్టాల వద్ద వరద పరిస్థితులను అంచనా వేస్తున్నారు. అందుకు అనుగుణంగా కొన్ని సర్వీసులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

నేడు ఎస్ఆర్ఎం వర్సిటీ స్నాతకోత్సవం

● ముఖ్య అతిథిగా మంత్రి లోకేశ్

తుళ్లూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం 5వ స్నాతకోత్సవానికి సిద్ధమైంది. మంగళవారం ఉదయం 11 గంటలకు యూనివర్సిటీ ఆడిటోరియంలో విద్యార్థులకు డిగ్రీల ప్రదానం జరగనుంది. ఈ కార్యక్రమా నికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈ మేరకు యూనివర్సిటీలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. యూనివర్సిటీలో 2020-25 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్ చదివిన 1877 మంది విద్యార్థులకు, మరో 39 మంది పరిశోధనా విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేయనున్నారు. ఇందులో 45 మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు, ఏడుగురు స్కూల్ ఆఫ్ బిజినెస్ విద్యార్థులకు, నలుగురు లిబరల్ ఆర్ట్స్ విద్యార్థులకు బంగారు, వెండి పతకాలను ప్రదానం చేయనున్నారు. స్నాతకోత్సవం ఉదయం 11 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం రెండు గంటలకు ముగియనుంది. సోమవారం ఉదయం యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్ కుమారు ఆడిటోరియంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. భారీ వర్షాల నేపథ్యంలో దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. స్నాతకోత్సవ కార్యక్రమంలో యూనివర్సిటీ కులపతి డాక్టర్ టీఆర్ పారివేందర్, ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్, ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ సతీష్ కుమార్, గవర్నింగ్ బాడీ మెంబర్లు పాల్గొననున్నారు.

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

తాడేపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పెనుమాక ఉండవల్లి శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొని సుమారు 70 సంవత్సరాలు వృద్ధుడు సోమవారం మృతి చెందాడు. వృద్ధుడి ఒంటిపై కాఫీపొడి రంగు చొక్కా, బ్లూ కలర్ పూల లుంగి ఉన్నాయని, తాడేపల్లి ఎస్ఐ ఖాజావలి తెలిపారు. మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించామని, మృతుడికి సంబంధించి వ్యక్తులు ఎవరైనా ఉంటే తాడేపల్లి పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

కారు డిక్కీలోంచి జారి పడిన బ్యాగు

- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు
- బ్యాగులో నగదు ఉన్నట్లు వెల్లడి

దాచేపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కారు డిక్కీలో పెట్టిన బ్యాగు జారి కిందపడి పోయిందని సోమవారం ఓ వ్యక్తి దాచేపల్లి పోలీసులను ఆశ్రయించారు. బ్యాగులో నగదు ఉన్నట్లు ఆయన పోలీసులకు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, దాచేపల్లి మండలం ఇరికేపల్లికి చెందిన భువణం పుల్లారెడ్డి హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. ఇరికేపల్లిలో సమీప బంధువులు మృతిచెందడంతో వారిని పరామర్శించేందుకు స్వగ్రామానికి వచ్చి తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరారు. దాచేపల్లి మండలం శ్రీనగర్ గ్రామం దాటిన తరువాత పర్సు కోసం జేబులో వెతికారు. అది కనిపించకపోయే సరికి డిక్కీలో ఉన్న బ్యాగులో ఉండేమోనని వెతికారు. బ్యాగులో పర్సు లేదు. ఇరికేపల్లిలోని బంధువులను ఫోన్‌లో సంప్రదించగా పర్సు అక్కడే ఉన్నట్లు సమాచారమిచ్చారు. పర్సు కోసం తిరిగి ఇరికేపల్లి చేరుకొని నేరుగా హైదరాబాద్ వెళ్లారు. అక్కడకు వెళ్లిన తర్వాత డిక్కీలో చూడగా నగదుతో ఉన్న బ్యాగు కనిపించలేదు. శ్రీనగర్ దాటిన తరువాత పర్సు కోసం డిక్కీని వెతికినప్పుడు బ్యాగు జారిపోయిందేమోనని బాధితుడు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి యువకుడి మృతి



జేమ్స్ (ఫైల్‌ఫోటో)

దుగ్గిరాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు రైలు కింద పడి యువకుడు మృతిచెందిన ఘటన సోమవారం దుగ్గిరాల మండలం మంచికల పూడి గ్రామ సమీపంలో జరిగింది. మంచికలపూడిలోని దళిత కాలనీకి చెందిన గౌతుమాసు జేమ్స్ (30) మంచికలపూడి రైల్వే గేటు వేసి ఉన్న సమయంలో రెండులైన్లు దాటి మూడో లైన్‌పైకి వస్తుండగా రైలు వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జేమ్స్ అక్కడికక్కడే మృతిచెందాడు. వెల్డింగ్ పనులు చేసుకుని జీవించే జేమ్స్‌కు భార్య లావణ్య, మూడేళ్ల కుమార్తె అక్షయ, ఏడాది కుమార్తె అక్షిత ఉన్నారు. జేమ్స్ మృతితో మంచికలపూడిలో విషాదఛాయలు అలముకున్నాయి జేమ్స్ తండ్రి ఇటీవలే మృతిచెందారు. జేమ్స్‌మృతితో వారి కుటుంబ పరిస్థితి మరింత దుర్భరంగా మారింది. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గుంటూరు డీపీటీవోగా సామ్రాజ్యం

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా ప్రజా రవాణాధి కారిగా (డీపీటీవో) డి.సామ్రాజ్యం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు బాపట్ల డీపీటీవోగా వ్యవహరిస్తున్న ఆమె బదిలీపై గుంటూరుకు వచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీటీఎమ్ సత్యనారాయణ, పీవో మాలతి, ఏటీఎం సాంబశివరావు, గుంటూరు-1, 2 డిపో మేనేజర్‌లు రామకృష్ణ, సునీత ఇతర అధికారులు పుష్పగుచ్ఛాలతో డీపీటీవో సామ్రాజ్యంకు అభినందనలు తెలియజేశారు. కాగా, ఇప్పటి వరకు గుంటూరు డీపీటీవోగా వ్యవహరించిన సీహెచ్ విమల బాపట్లకు బదిలీ అయ్యారు.



డీపీటీవో విమల నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న సామ్రాజ్యం

గోవిందాపురంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు

మాచవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గుప్త నిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు జరిపిన ఘటన మాచవరం మండలంలోని పాత గోవిందాపురం గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం, గుర్తు తెలియని వ్యక్తులు పాత గోవిందాపురంలో ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయానికి వెళ్లి దేవాలయం లోపల ఉన్న కంకరను పగల గొట్టే ప్రయత్నం చేశారు. అదే సమయంలో పిడుగురాళ్ళ పట్టణానికి చెందిన ఒక భక్తుడు తన మొక్కుబడి తీర్చుకొనేందుకు ఆంజనేయ స్వామి దేవాలయం వద్దకు వెళ్ళాడు. అతన్ని చూసిన ఆ వ్యక్తులు ఒక్కసారిగా పరారయ్యారు. భక్తులు, గ్రామస్థులు విషయాన్ని మాచవరం పోలీసుస్టేషన్‌కు చేరవేశారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. నిందితులు అక్కడ వదిలి వెళ్ళిన రెండు ద్విచక్ర వాహనాలు, గడ్డపారలు, వస్తు సామగ్రిని స్వాధీనం చేసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. దేవాదాయశాఖ ఈవో శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అయితే దేవాలయంలో ఎలాంటి వస్తువులు అపహరణకు గురి కాలేదని పోలీసులు పేర్కొన్నారు.

ఏఎన్‌యూ క్యాంపస్ కళాశాలలకు సెలవులు

● వసతి గృహాల విద్యార్థుల భద్రతకు ప్రత్యేక చర్యలు

ఏఎన్‌యూ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తీవ్రంగా మారుతుందనే హెచ్చరికలతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం యంత్రాంగం అప్రమత్తమైంది. క్యాంపస్ కళాశాలలకు సోమవారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకు సెలవులు ప్రకటిస్తూ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆదేశాలతో కూడిన ఉత్తర్వులను రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం సోమవారం జారీ చేశారు. ఈ మేరకు సోమవారం తరగతులకు హాజరైన విద్యార్థులు, అధ్యాపకులను మధ్యాహ్నం ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేసి గమ్యస్థానాలకు చేర్చారు. విశ్వవిద్యాలయంలోని పరిపాలన విభాగాలు యథావిధిగా పనిచేస్తాయని రిజిస్ట్రార్ ఉత్తర్వులలో సూచించారు. భారీ వర్షం పడినప్పుడల్లా విశ్వవిద్యాలయంలోని అశోక, గౌతమి వసతి గృహాల్లోకి నీరు రావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడటాన్ని దృష్టిలో ఉంచుకున్న అధికారులు ఆయా వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థులను వేరే చోటుకు తరలించి ప్రత్యేక వసతి సదుపాయం కల్పించారు. వారికి అదనంగా భోజన సదుపాయంతోపాటు వైద్య సదుపాయం అందుబాటులో ఉంచారు. తుఫాన్ దృష్ట్యా ఇంజనీరింగ్ బాలుర వసతి గృహాలతో పాటు మహిళా వసతి గృహాల్లోని విద్యార్థులు బయటకు వెళ్లకుండా వార్డెన్లు, అధ్యాపకులతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. తల్లిదండ్రుల అనుమతితో రవాణా సదుపాయం ఉన్న ప్రాంతాల విద్యార్థులను మాత్రమే వసతి గృహాల నుంచి వారి స్వస్థలాలకు వెళ్లడానికి అనుమతి ఇస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	135, 144, 155
చికెన్ విత్ స్కిన్(కిలో)	260.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	270.00

41,568 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 42,383 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 41,568 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,039 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	12500
334	10000	15200	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	14200	334	10500	15000
273	----	---	నెంబరు. 5	10000	14500
341	10000	16000	273	---	----
4884	----	----	341	10000	16200
సూపర్ 10	10000	14500	సూపర్ 10	11000	14700
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15100	తేజ	10000	15000
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15200
బ్యాడిగి	10500	15100	దేవనూరు డీలక్స్	10500	14400
దేవనూరు డీలక్స్	10000	14300	తాలుకాయలు	5000	8000


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నసీర్, పక్కన కమిషనర్ తదితరులు

ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి

- తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో తీవ్ర గాలులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున నగరంలో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టి చర్యలు తీసుకోవాలని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తెలిపారు. మొంథా తుఫాన్ వలన ఇబ్బందులు కలగకుండా తీసుకోవలసిన ముందస్తు చర్యలపై నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో కమిషనర్, కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ కార్యదర్శులతో సోమవారం నియోజకవర్గ సమావేశం నిర్వహించారు.

ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో 72 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, వాటిలో 29 తూర్పు నియోజకవర్గంలో ఉన్నాయన్నారు. తూర్పు నియోజకవర్గంలోని కేంద్రాల్లో సుమారు 10 వేల మంది వరకు వసతి కల్పించడానికి వీలుందన్నారు. పునరావాస కేంద్రాల్లో సమగ్ర మౌలిక వసతులు, ఆహారం, తాగునీరు అందించడం, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యుత్, ఇతర శాఖల అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని, జీఎంసీ అధికారులు పారిశుధ్యం, పూడికతీత, పునరావాస కేంద్రాల ఏర్పాటుకు బాధ్యతగా ఉండాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, గుంటూరు తూర్పు తహసీల్దార్ సుభాని, కార్పొరేటర్లు, అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజలు ఇబ్బంది పడకుండా మైక్రో ప్లాన్ మేరకు చర్యలు

- కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరుకార్పొరేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో నగరపాలక సంస్థ పరిధిలో ముంపునకు గురై ప్రజలు ఇబ్బందులు పడకుండా మైక్రో ప్లాన్ మేరకు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. కమిషనర్ సోమవారం ఏటి అగ్రహారం, శాంతినగర్ ప్రాంతాల్లో పీకలవాగుని పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ మేజర్, అవుట్ ఫాల్ డ్రెయిన్లలో పూడికతీత, ఆక్రమణల తొలగింపు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నగరంలో 72 పునరావాస కేంద్రాలు ఏర్పాటు

మొంథా తుఫాను ముందస్తు చర్యల్లో భాగంగా నగరంలో 72 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. పునరావాస కేంద్రాల్లో సుమారు 30 వేల మందికి పైగా వసతి, మౌలిక సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకున్నామన్నారు. పునరావాస కేంద్రాల్లో సమగ్ర ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పిస్తున్నామని, సమీప కేంద్రాల సమాచారం కోసం కమాండ్ కంట్రోల్ రూమ్ 0863-2345103కి కాల్ చేయవచ్చని కమిషనర్ తెలిపారు.

జీఎంసీలో ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు


ప్రజలకు ఏవైనా సమస్యలు వచ్చినా నగరపాలక సంస్థలో ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. కాల్ సెంటర్ నెంబర్లు 0863-2345103, వాట్సాప్ నెంబర్ 98499 08391లో సంప్రదించాలన్నారు. ముంపునకు గురయ్యే ప్రాంత ప్రజలు, లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలు నగర పాలక సంస్థ ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు రావాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మొంథా తుఫాన్ నేపథ్యంలో నగరంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, నగర ప్రజలు అప్రమత్తంగా ఉండి నగర పాలక సంస్థకు సహకరించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. నగరపాలక సంస్థలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తుఫాన్ కారణంగా నగరంలో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా 57 డివిజన్లకు 57 మంది నోడల్ అధికారులను ఏర్పాటు చేశామని, వారు క్షేత్ర స్థాయి అధికారులను పర్యవేక్షణ చేస్తూ ఉంటారన్నారు. నగరంలో 12 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి సదరు ప్రాంతాలలో ముందస్తు జాగ్రత్తలు చర్యలు కూడా తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, మేనేజర్ బాలాజీ బాషా, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త చెరుకు రసం యంత్రాన్ని అమ్ముకుని....పాతది ఇస్తున్నారు

- మున్సిపాలిటీ అధికారుల నిర్వాకం
- ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన వృద్ధ దంపతులు


కలెక్టరేట్‌కు వచ్చిన వృద్ధ దంపతులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రక్కన వ్యాపారం చేస్తున్నారనే నెపంతో కొత్త చెరుకు రసం యంత్రాన్ని మున్సిపల్ అధికారులు తీసుకువెళ్లారని... దాని కోసం తిరుగుతుంటే పాత మిషన్ చూపించి సరిపెట్టుకోమంటున్నారని స్థానిక బొంగరాలబీడుకు చెందిన చల్లా సుబ్బలచ్చమ్మ, ఆమె భర్త చల్లా లచ్చమయ్య వాపోయారు. దీనిపై వారు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. తుఫాన్ నేపథ్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం రద్దు కావడంతో నిరాశతో వెనక్కి తిరిగారు. అనంతరం వారు మాట్లాడుతూ కొత్తపేటలోని ఓ ప్రైవేటు పాఠశాల వద్ద జ్యూస్ షాపు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నామని తెలిపారు. ఏడాది క్రితం నగరపాలక సంస్థకు చెందిన కొందరు అధికారులు, సిబ్బంది వచ్చి దుకాణాన్ని తొలగించారని, అప్పుచేసి రూ.60 వేలతో కొనుక్కున్న చెరుకు రసం యంత్రాన్ని కూడా తీసుకువెళ్లారని తెలిపారు. ఆ మిషన్ కోసం కమిషనర్‌ను కలవగా ఆ యంత్రాన్ని ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. మరో పాత మిషన్ చూపించి ఇదే మీ మిషన్ తీసుకువెళ్లండి....అంటూ బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిరు వ్యాపారం మీద జీవనం సాగిస్తున్న తమకు న్యాయం చేయాలని కోరారు.

శివాజీని పరామర్శించిన తీగల కృష్ణారెడ్డి


శివాజీతో మాట్లాడుతున్న తీగల కృష్ణారెడ్డి

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ మాజీ సభ్యుడు, శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ పాఠశాల కమిటీ గౌరవాధ్యక్షుడు యలమంచిలి శివాజీ అస్వస్థతకు గురై హైదరాబాద్‌లో ట్రీట్మెంట్ తీసుకొని ప్రస్తుతం ఆయన నివాసంలో విశ్రాంతి పొందుతున్నారు. ఆయనను హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి సోమవారం శివాజీ నివాసంలో కలిసి పరామర్శించారు. శివాజీ ఆరోగ్యం గురించి వాకబు చేసిన తరువాత రాష్ట్ర రాజకీయాలు, దేశ ఆర్థిక స్థితిగతులు, మొంథా తుఫాను, రైతులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల ఎదుర్కొంటున్న గ్రాట్యూటీ చెల్లింపులు, హైయ్యర్ పెన్షన్ సమస్యలను పరిష్కరించాలని ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.గంగాధరరావు డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ మాలతికి వినతి పత్రం అందజేశారు. ఈ నిరసనలో పి.శేషగిరిరావు, బి నాగేశ్వరరావు, బి సాంబయ్య, కే బుల్లియ, జే నాంచారయ్య, సిహెచ్ వెంకటేశ్వరరావు, రామచంద్రరావు పాల్గొన్నారు.

యంత్రాంగం... అప్రమత్తం

- కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూంకు సచివాలయాల మ్యాపింగ్
- ఒక్కో డిపార్టుమెంట్ నుంచి ఒక ఉద్యోగికి డ్యూటీ
- ఏ చిన్న ఫిర్యాదు వచ్చినా వెంటనే స్పందించే వ్యవస్థ ఏర్పాటు

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను వలన విపత్కరమైన పరిస్థితులు ఏమైనా తలెత్తితే వెంటనే వాటిని అధిగమించేందుకు పటిష్టమైన వ్యవస్థని జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసింది. జిల్లాలోని గ్రామ/వార్డు సచివాలయాలన్నింటిని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు మ్యాపింగ్ చేసింది. దీని వలన ఏదైనా సంఘటన జరిగిన నిమిషాల వ్యవధిలో కంట్రోల్ రూంకు తెలిసిపోతుంది. దాంతో కంట్రోల్ రూం సంబంధిత ప్రభుత్వ జిల్లా శాఖని అప్రమత్తం చేసి సంఘటన జరిగిన ప్రదేశానికి సిబ్బందిని పంపించి సమస్యని వేగవంతం పరిష్కరిస్తుంది. ఇందుకోసం కంట్రోల్ రూంలో ప్రతి ఒక్క డిపార్టుమెంట్ నుంచి ఒక ఉద్యోగికి డ్యూటీ వేశారు. ఈ కంట్రోల్ రూం 24 గంటలు పని చేసేలా మూడు షిఫ్టులలో ఉద్యోగులను నియమించారు.

మంగళవారం రాత్రికి తుపాను తీరం దాటే అవకాశం ఉండటంతో ఈదురుగాలులు బలంగా వీచే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అలానే వర్షపాతం కూడా ఎక్కువగా నమోదు కావొచ్చని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజాసంబంధాలు కలిగివుండే ప్రభుత్వ శాఖలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు.

గుంటూరు, మంగళగిరి తాడేపల్లి మునిసిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఎక్కడైనా లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిలబడితే దానిని తోడించేందుకు అవసరమైన విద్యుత్ మోటార్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. తాగునీటి పథకాలకు విద్యుత్ సరఫరా అంతరాయం కలిగితే వెంటనే పునరుద్ధరించేందుకు జనరేటర్లను సిద్ధం చేయించారు. కాలువలు, వాగులకు గండ్లు పడితే వెంటనే పూడ్చేందుకు అవసరమైన ఇసుక బస్తాలు, జేసీబీలను ఇరిగేషన్ శాఖతో రెడీగా పెట్టించారు. రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్ రోడ్లు దెబ్బతింటే వెంటనే పూడ్చేందుకు అవసరమైన మెటీరియల్‌ని సిద్ధం చేశారు.

పునరావాస కేంద్రాలను ఇప్పటికే కొన్ని తెరిచారు. ఇక ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల తాళాలను సచివాలయాల సిబ్బంది స్వాధీనం చేసుకొన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితి ఎదురైనా వెంటనే వాటిని పునరావాస కేంద్రాలుగా మార్చి అక్కడికి ప్రజలను తరలిస్తారు. ఆయా చోట్ల ప్రజలకు అవసరమైన ఆహారం, పాలు, వైద్యసాయం వంటివి అందించేందుకు సంబంధిత శాఖల సిబ్బందిని సిద్ధం చేశారు.

మొంథాను ఎదుర్కొనేందుకు పోలీస్ శాఖ సన్నద్ధం : ఎస్పీ


ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు పోలీస్ శాఖ సర్వం సన్నద్ధమైంది. జిల్లా వ్యాప్తంగా పోలీస్ యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉన్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేసారు. దీనిలో భాగంగా మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం పోలీస్ శాఖ తరఫున కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేసి, పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా ప్రమాదకర వంతెనలు, బ్రిడ్జిలు, కల్వర్టుల వద్ద పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు కూడా అత్యవసరమైతే తప్ప గృహాల నుండి బయటకు రాకుండా పోలీస్ వారికి సహకరించాలని కోరారు. జిల్లా పోలీస్ శాఖ తరఫున తుఫాన్ ప్రభావిత ప్రాంతాలు, ముంపు ముప్పు ఉన్న గ్రామాలను ముందస్తుగా గుర్తించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ అన్ని స్థాయిల్లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కంట్రోల్ రూమ్‌లు నిరంతర (24 /7) పద్ధతిలో పనిచేస్తాయని ఎస్పీ తెలిపారు. ఆశ్రయ కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, లైటింగ్, ఔషధాలు, పరిశుభ్రతా సదుపాయాలు ఉండేలా చూడాలని ఎస్పీ ఆదేశించారు. గర్భిణీలు, వృద్ధులు, పిల్లలు వంటి సున్నిత వర్గాల వారిని ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. అవసరమైన రవాణా వనరులు (బస్సులు, పడవలు, అంబులెన్స్‌లు) సిద్ధంగా ఉంచాలన్నారు.

లలితా హాస్పిటల్‌కు 'డైమండ్ స్టేటస్' అవార్డు

- బెస్ట్ స్ట్రోక్ యూనిట్‌గా అంతర్జాతీయ స్థాయి గుర్తింపు


బార్సిలోనా సదస్సులో న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయ

గుంటూరు మెడికల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పక్షవాత రోగులకు నాణ్యమైన, ప్రాణాధార వైద్య సేవలు అందిస్తున్నందుకు గుంటూరులోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన డైమండ్ స్టేటస్ అవార్డు లభించింది. స్పెయిన్‌లోని బార్సిలోనా నగరంలో ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు జరిగిన 17వ వరల్డ్ స్ట్రోక్ కాంగ్రెస్ సదస్సులో లలితా హాస్పిటల్ చీఫ్ న్యూరాలజిస్ట్, ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ (ఐఎస్ఏ) అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ అవార్డును అందుకున్నారు. పక్షవాత రోగులకు ఉత్తమ చికిత్సలు అందించినందుకు గాను వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్, ఏంజెల్స్ ఇనీషియేటివ్ ఈ అవార్డును ప్రదానం చేశాయి. అత్యుత్తమ స్ట్రోక్ ఐసీయూ ఆసుపత్రులకు ఏటా అందజేసే ఈ ప్రతిష్టాత్మకమైన డైమండ్ స్టేటస్ అంతర్జాతీయ అవార్డు అందుకోవడం డాక్టర్ విజయకు ఇది వరుసగా ఐదో సారి. బార్సిలోనా సదస్సులో ప్రపంచంలోని 100కి పైగా దేశాల నుంచి మూడు వేల మంది న్యూరాలజిస్టులు, స్ట్రోక్ నిపుణులు, పరిశోధకులు, పాలసీ మేకర్లు పాల్గొన్నారు. భారతదేశం నుంచి ఆహ్వానిత స్పీకర్‌గా హాజరైన డాక్టర్ విజయ సదస్సులో ప్రసంగిస్తూ పెరుగుతున్న పక్షవాత కేసుల నేపథ్యంలో.. భారతదేశంలోని ప్రతి జిల్లాలో ఒక స్ట్రోక్ యూనిట్ ఏర్పాటు అవసరాన్ని వివరించారు. పక్షవాత కేసులను దృష్టిలో ఉంచుకొని అత్యవసర వైద్య సదుపాయాలను బలోపేతం చేయవలసిన అవసరం ఏర్పడిందని ఆమె అభిప్రాయపడ్డారు.

మైనారిటీల అభ్యున్నతికి రోడ్ మ్యాప్

- తూర్పు ఎమ్మెల్యే నసీర్


లీడ్ బ్యాంకు అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో మైనారిటీల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నామని, సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో దీని కోసం రోడ్ మ్యాప్ రూపొందిస్తున్నామని తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. రాష్ట్ర శాసనసభలోని మైనారిటీ శాఖ కార్యాలయంలో సోమవారం ఆయన లీడ్ బ్యాంక్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మైనారిటీలకు అమలవుతున్న సంక్షేమ ఫలాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. మైనారిటీలకు అందాల్సిన పథకాల అమలకు త్వరలో అధికారులతో నూతన కమిటీని ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇమామ్‌లు, మౌజన్లకు గౌరవ వేతనం నిధులు అందించామని తెలిపారు. రాష్ట్రంలో మైనారిటీ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో విద్యార్థులు, లెక్చరర్ల సంఖ్యపై ఆరా తీశారు. ఎక్కడెక్కడ సిబ్బంది అవసరమో గుర్తించి వివరాలు అందజేయాలని సూచించారు. 2014-19 మధ్య, ఆ తర్వాతికాలంలో మైనార్టీలకు రుణం ఎంత మంజూరు చేశారో నివేదిక సమర్పించాలని లీడ్ బ్యాంక్ అధికారులను కోరారు. మైనారిటీలకు విరివిగా రుణాలివ్వాలని సూచించారు. అనంతరం బీఆర్ అంబేద్కర్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ స్కీమ్ అమలు గురించి తెలుసుకున్నారు. వక్ఫ్ బోర్డు సమస్యలతోపాటు మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అందించిన రుణాలపై నివేదిక ఇవ్వాలని సూచించారు. బీసీ- ఈల సర్టిఫికెట్ల జారీలో అర్హత ప్రమాణాలను నివేదించాలన్నారు. హజ్ యాత్రికులకు అర్హత, వసతి ఏర్పాట్లపై వివరాలు కోరారు.

వేడుకగా ఆత్మీయ పురస్కారాల ప్రదానం

గుంటూరు(తూర్పు), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ పద్మావతి కళ్యాణ వేదికపై యువకళావాహిని, ఆరాధన ఆర్ట్స్ అకాడమీ, డాక్టర్ రామరాజు ఫౌండేషన్, ఎన్టీఆర్ కళాపరిషత్, వైకే నాటక పరిషత్, ఉషోదయ కళానికేతన్, కళావిపంచి గుంటూరు వారి సంయుక్త నిర్వహణలో బొప్పన నరసింహారావు ఆధ్వర్యంలో కళ పత్రిక ప్రత్యేక సంచిక ఆవిష్కరణ, ఆత్మీయ పురస్కార సభ నిర్వహించారు. తొలుత నిర్వాహకులు కళాపత్రిక ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. అనంతరం దాదాపు 20 మంది టీవీ, రంగస్థల కళాకారులను, అతిథులను ఆత్మీయ పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. యువకళా వాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ సభా కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత జరిగిన సంగీత విభావరిలో ఆలాపన వెంకటేశ్వరరావు, మునిపల్లె రమణి, మల్లేశ్వరి భక్తి గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. అనంతరం ప్రదర్శించిన గారడి నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని జీ.మల్లికార్జునరావు, భాగీశివశంకర్, శంకర్, జానీ బాషా, తిరుమలేశ్వరావు తదితరులు పర్యవేక్షించారు.


కళాకారులను సత్కరిస్తున్న నిర్వాహకులు

కెటిల్‌బెల్ క్రీడపై ఆసక్తి పెంచుకోవాలి

గుంటూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శారీరక ధృఢత్వానికి కెటిల్‌బెల్ క్రీడ దోహదం చేస్తుందని గిరెవోయ్ స్పోర్ట్స్ ఇండియా ఫెడరేషన్ కార్యదర్శి పరాగ్ మహాత్రే అన్నారు. స్థానిక లక్ష్మీపురంలో కెటిల్‌బెల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కెటిల్‌బెల్ పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ఈ క్రీడ దేశంలో ప్రాచుర్యం పొందుతుందని తెలిపారు. ఏపి గిరెవోయ్ స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎండి జావిద్ అహ్మద్ మాట్లాడుతూ త్వరలోనే జాతీయ స్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ కార్యదర్శి జి వి ఎస్ ప్రసాద్, డాక్టర్ నీలిమ, చైతన్య తదితరులు విజేతలకు పతకాలు, సర్టిఫికెట్స్ అందజేశారు.

రైల్వేలో ప్రారంభమైన విజిలెన్స్ అవగాహన వారోత్సవం

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏటా సర్దార్ వల్లభాయి పటేల్ జయంతి సందర్భంగా ప్రభుత్వ శాఖల్లో నిర్వహించే విజిలెన్స్ అవగాహన వారోత్సవం రైల్వేలో ప్రారంభమైంది. సోమవారం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో డీఆర్ఎం సుధేష్ణ సేన్ అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ ఏడాది విజిలెన్స్ - మన ఉమ్మడి బాధ్యత అనే నినాదంతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ ఒక్కరూ చట్ట నియమాలు పాటిస్తూ నిజాయితీగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం రమేష్‌కుమార్, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

మరింత బాధ్యతగా పని చేయండి : ఎస్పీ

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగోన్నతి పొందడమంటే బాధ్యత పెరగడమేననే విషయాన్ని గుర్తు పెట్టుకుని మరింత బాధ్యతగా పని చేయాలని ఉద్యోగోన్నతి పొందిన ఎస్ఐలకు ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. ఉద్యోగోన్నతి పొందిన ఎస్సైలు సోమవారం ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. రమణా రెడ్డి, సుధాకర్, మురళీ కృష్ణ తదితరులు ఉద్యోగోన్నతి పొందిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వీరు ముగ్గురు ఎస్పీ వద్ద రిపోర్ట్ చేసారు. పోలీస్ స్టేషన్లలో పోస్టింగ్స్ కేటాయిస్తూ త్వరలో ఉత్తర్వులు ఇస్తామని ఎస్పీ తెలిపారు.

నగరంపాలెం సీఐగా సత్యనారాయణ


సీఐ సత్యనారాయణ

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : నగరంపాలెం సీఐగా వై సత్యనారాయణను నియమిస్తూ ఐజి సర్వ శ్రేష్ట త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. కొద్ది నెలలుగా నగరంపాలెం ఇన్‌చార్జి సిఐగా కిషోర్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ మేరకు నగరంపాలెం సీఐగా నియమితులైన వై సత్యనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం


సత్యసువార్త సందేశ కుసుమాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ రవి తదితరులు

గుంటూరు (తూర్పు), అక్టోబరు 27(ఆంధ్ర జ్యోతి): క్రీస్తు బోధనలు ఆచరణీయమైనవి ఏసీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ పి.ఆంద్రూ అన్నారు. స్థానిక బ్రాడీపేటలో ఆయన రచించిన 'సత్యసువార్త సందేశకుసుమాలు' పుస్తకాన్ని ప్రముఖ వైద్యులు వైడిఎస్ రవి సోమవారం ఆవిష్కరించారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ టిజె రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పరిశు ద్ధాత్మ ప్రేరణతో రాసిన ఈ పుస్తకం పాఠకుల హృదయాలను కదిలించేదిగా, సమాజంలోని అన్ని వర్గాల వారిని ఆలోచింపజేసే విధంగా ఉందన్నారు. రచయిత ఆంద్రూ మాట్లాడుతూ ఏసు బోధనలు ప్రతి మనిషి మంచి మార్గంలో పయనించేందుకు దోహదప డతాయన్నారు. విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ నీలకంఠం పుస్తక సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గురునాథం, డాక్టర్ శిఖామణి, నిరీక్షణరావు, గణేష్, బెంజిమిన్, డాక్టర్ తూములూరి రాజేంద్ర ప్రసాద్, స్వరూప్ కుమార్, డాక్టర్ లావణ్య తదితరులు ప్రసంగించారు.

శ్రావ్యంగా సాగిన శాస్త్రీయ సంగీత గాత్ర కచేరి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం, శ్రీ త్యాగరాజ కళావేదిక సంస్థ వేదికపై శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 29 వరకు జరిగే వాగ్గేయకార మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కార్యక్రమాల్లో భాగంగా మూడో రోజున జరిగిన జె వి కీర్తన చెన్నై వారి శాస్త్రీయ సంగీత గాత్ర కచేరి వీనులవిందుగా సాగింది. కళాకారులను సంస్థ సభ్యులు కృష్ణకిషోర్, ఎస్ గిరిజాశంకర్, నేతి విశ్వేశ్వరరావు సత్కరించారు.


అధికారులతో సమీక్ష జరుపుతున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

తుఫాన్ దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు పునరావాస కేంద్రాల గురించి ప్రజలకు సమాచారం ఇవ్వాలని పశ్చిమ ఎమ్మెల్యే ఎమ్మెల్యే గళ్లా మాధవి సూచించారు. పశ్చిమ కార్యాలయంలో సోమవారం ఆమె తుఫాను సన్నద్ధతపై ముందస్తు చర్యలు, ప్రజలకు కల్పించవలసిన పునరావాస కేంద్రాలు, వరద ప్రభావిత ప్రాంతాల పరిస్థితులపై నోడల్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, విద్యుత్ శాఖ, తహసీల్దార్, ట్రాఫిక్ పోలీసులు తదితర శాఖాధికారులతో ఎమ్మెల్యే మాధవి చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో డివిజన్ల వారీగా పునరావాస కేంద్రాలను సిద్ధం చేసి, వాటిలో అవసరమైన సదుపాయాలు సక్రమంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావాన్ని తగ్గించేందుకు మున్సిపల్, పోలీస్, ట్రాఫిక్, ఫైర్, విద్యుత్ శాఖలతో సమన్వయం కలిగి ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. భారీ వర్షాల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం రాకుండా కమాండ్ కంట్రోల్ రూమ్ పర్యవేక్షణను బలోపేతం చేయాలని, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే గళ్లా మాధవి సూచించారు.

20 మందిని పునరావాస కేంద్రానికి తరలించిన పోలీసులు

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీకృష్ణదేవరాయనగర్‌లో 20 మందిని పోలీసులు కాపాడి ముందు జాగ్రత్త చర్యగా పునరావాస కేంద్రానికి తరలించారు. ఈ మేరకు సోమవారం శ్రీ కృష్ణ దేవరాయ నగర్ కు చెందిన 20 మందిని పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు, ఎస్సై రామాంజనేయులు పునరావాస కేంద్రానికి తరలించారు. మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఎస్పీ వకుల్ జిందాల్, వెస్ట్ డిఎస్పీ అరవింద్ ఆదేశాల మేరకు పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ స్తంభాలగరువు మెయిన్ రోడ్డులోని మహాలక్ష్మమ్మ పుల్లయ్య మునిసిపల్ హైస్కూల్‌లోని ప్రభుత్వ పునరావాస సెంటర్‌కు తరలించారు. స్థానికులు పోలీస్ వారు తీసుకున్న చర్యలను అభినందించారు.

ప్రస్తుతం పంట నష్టం లేదు

- జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు

గుంటూరు సిటీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండటమే పెద్ద ఆయుధం వంటిది అని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు అన్నారు. గుంటూరులో సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం పంట నష్టం సంభవించలేదని తెలిపారు. జిల్లాలోని పలు మండలాల్లో కలెక్టర్ తమీమ్ అన్సారీయాతో కలిసి పంట పొలాలను పరిశీలిం చామని వెల్లడించారు. జిల్లాలో పత్తి, వరి ప్రధాన పంటలుగా సాగు చేశారని తెలిపారు. వరి ప్రస్తుతం పొట్ట దశలో ఉన్నందున వర్షం కురవటం వల్ల నష్టం వాటిల్లే అవకాశం లేదని తెలిపారు. తుఫాను తీరం దాటే సమయంలో తీవ్రంగా గాలులు వీస్తే దానివల్ల వరికి నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. పత్తి కూడా ప్రస్తుతం కాయ దశలోనే ఉందని, వీలైనంత వరకు పొలంలో వర్షం నీరు నిలబడకుండా చూసుకోవాలని సూచించారు. పొలాల్లో క్రిమిసంహారక మందులు, ఎరువులు వేయ వద్దని జిల్లా వ్యవసాయ అధికారి రైతులకు విజ్ఞప్తి చేశారు. వర్షం ఆగిన తరువాత ఏ మందులు వేయాలో స్థానిక వ్యవసాయ అధికారులు తెలియజేస్తారని వెల్లడించారు.

జాబ్ మేళా వాయిదా

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పొన్నూరు రోడ్డులోని ఆంధ్రా ముస్లిం కళాశాలలో ఈ నెల 30న నిర్వహించాల్సిన జాబ్ మేళాను వాయిదా వేయడం జరిగిందని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి కొండా సంజీవరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మొంథా తుఫాన్ దృష్ట్యా తాత్కాలికంగా రద్దు చేయడం జరిగిందన్నారు. తిరిగి ఎప్పుడు నిర్వహించే తేదీని త్వరలోనే ప్రకటించడం జరుగుతుందని తెలిపారు.

వలివేరు డీసీఎంఎస్ కేంద్రంలో చైర్మన్ హరిబాబు తనిఖీలు


రికార్డులు పరిశీలిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ హరిబాబునాయుడు

గుంటూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వేమూరు నియోజకవర్గ పరిధిలోని వలివేరు డీసీఎంఎస్ కేంద్రాన్ని జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ వడ్రాణం హరిబాబునాయుడు సోమవారం సందర్శించారు. కేంద్రంలో స్టాక్ రిజిష్టర్‌ను పరిశీలించారు. గిడ్డంగుల్లో నిల్వ ఉన్న ఎరువులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ హరిబాబు మాట్లాడుతూ రైతులకు ఎక్కడా ఎరువులు, యూరియా కొరత లేకుండా కూటమి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. సీఎం చంద్రబాబు వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారన్నారు.

- చెట్లు, విద్యుత్ స్తంభాల జోలికి వెళ్లవద్దు
- సురక్షితమైన నిర్మాణంలోనే తలదాచుకోవాలి
- ఎమర్జెన్సీ ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంచుకోవాలి
- విపత్తు నిర్వహణశాఖ అధికారులు

మొంథా.. జాగ్రత్త

అత్యవసరం అయితేనే బయటకు వెళ్లాలి

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రజల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. తీవ్ర తుఫాన్‌గా మారి రాష్ట్రం మీదుగా తీరం దాటనున్న నేపథ్యంలో కోస్తా జిల్లాల ప్రజల్లో వణుకు మొదలయింది. మంగళవారం అర్ధరాత్రి తర్వాత తీరందాటనున్న నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా, బాపట్ల జిల్లా చీరాల డివిజన్ పరిధిలోని తీరప్రాంతం సహా అన్ని ప్రాంతాలపై తుఫాన్ ప్రభావం ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగమంతా అప్రమత్తమై ముందస్తు సంరక్షణ చర్యలు చేపడుతున్నారు. పాఠశాలలు, విద్యాసంస్థలకు మూడు రోజులపాటు సెలవులు ప్రకటించారు. ముంపు ప్రభావిత ప్రాంతాల ప్రజలను సంరక్షణ శిబిరాల్లోకి తరలిస్తున్నారు. ఎవరికివారుగా తగు అప్రమత్తతతో ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తు నిర్వహణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

జాగ్రత్తలు ఇలా..

- తుఫాన్ సమయంలో, ఇంట్లో నుంచి బయటకు రాకుండా సురక్షితంగా ఉండాలి, బయటకు వెళ్ళవలసి వస్తే అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకోవాలి. వీలయితే వెళ్లకుండా ఉండడమే మంచిది.
- రేకులు, పూరిల్లు, పెంకుటిళ్లలో నివసించేవారు పక్కా ఇళ్లలో సంరక్షణ పొందడం మంచిది.
- తుఫాన్ సమయంలో వీచే ఈదురుగాలులకు రేకులు, పైకప్పులు ఎగిరిపోయే ప్రమాదం ఉంటుంది కాబట్టి ఆ ఇళ్లకు దూరంగా ఉండడం మంచిది.
- పక్కా ఇంట్లో ఉన్నా కిటికీలు, తలుపులు మూసుకుని ఉండడం మంచిది. తుఫాను గాలుల్లో కొట్టుకువచ్చే వస్తువులు ఇళ్లలోకి చొరబడి డ్యామేజీ చేయకుండా రక్షించుకోవచ్చు. అదే సమయంలో తలుపులు, కిటికీలకు దగ్గరగా ఉండకూడదు.
- పాత భవనాలు, గోడలు, చెట్లు, విద్యుత్ స్తంభాలు ఉన్న చోట ఉండకూడదు.
- తప్పనిసరై బయటకు వెళితే.. రోడ్డుపై ఉండే విద్యుత్ స్తంభాలు, తీగలను గమనించుకుంటూ వెళ్లాలి. వాటికి దూరంగా వెళ్లడం మంచిది.
- గాలుల తీవ్రతకు చెట్ల కొమ్మలు విరిగి పడే ప్రమాదం ఉంది కాబట్టి చెట్ల కిందకు వెళ్లకూడదు. ఒక్కోసారి చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై పడి అవి తెగి నీటిలో పడే ప్రమాదం ఉంది. కాబట్టి అప్రమత్తంగా ఉండాలి. అలాంటివి గమనించిన వెంటనే విద్యుత్‌శాఖకుగానీ, కలెక్టరేట్, తహసీల్దారు కార్యాలయాల్లో ఏర్పాటు చేసే కంట్రోల్ రూమ్‌కు సమాచారమివ్వాలి.
- తుఫాన్ సంరక్షణకు సంబంధించి పోలీసు, రెవెన్యూ, విపత్తు నిర్వహణశాఖ, అగ్నిమాపకశాఖ, ఇతర రెస్క్యూ బృందాల ఫోన్ నెంబర్లు సేకరించి పెట్టుకోవాలి.
- అత్యవసర సహాయం కోసం పోలీసు, రెవెన్యూ, రెస్క్యూ బృందాల సహకారం తీసుకోవాలి తప్ప సొంత ప్రయత్నాలు చేయకూడదు.
- తుఫాన్ ప్రభావం మూడు, నాలుగు రోజులు ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇంట్లోకి అవసరమైన తాగునీరు, నిత్యావసర సరుకుల వంటివి ముందుగానే సేకరించి పెట్టుకోవాలి.
- తుఫాన్ ప్రభావం ఉన్నంత సేపూ ఇంట్లోని మెయిన్ స్విచ్ ఆఫ్ చేసి ఉంచడం మంచిది. షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలను నివారించవచ్చు.
- ఇంట్లోని విద్యుత్ ఉపకరణాలను ప్రధానంగా టీవీ, ఏసీ వంటి ఖరీదైన వస్తువులను ఉపయోగించకపోవడం మంచిది. వాటిని స్విచ్ ఆఫ్ చేయడంతో పాటు కనెక్షన్లు కూడా తొలగించి పెట్టుకోవడం అవసరం.
- వంటింట్లో గ్యాస్ కనెక్షన్‌ను కూడా తీసివేసి ఉంచడం మంచిది.
- తుఫాన్ సమయంలో పుకార్లు షికార్లు చేస్తుంటాయి. వదంతులు వ్యాపిస్తుంటాయి. వాటిని ఎట్టి పరిస్థితుల్లో నమ్మవద్దు. వాటి కారణంగా అనవసర ఆందోళనకు గురయ్యే ప్రమాదం ఉంది. అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలి.
- సమాచారం కోసం మొబైల్ ఫోన్‌ను ఎప్పటికప్పుడు చార్జ్ చేసుకుంటూ ఉండాలి. వాతావరణశాఖ, విపత్తు నిర్వహణశాఖలు పంపించే ఎస్ఎంఎస్‌లను చూసుకుంటూ ఉండాలి.
- విలువైన పత్రాలు.. అంటే ఇంటి దస్తావేజులు, సర్టిఫికేట్స్ వంటి వాటిని వాటర్ ప్రూఫ్ కవర్లు, కంటైనర్లలో భద్రపరుచుకోవాలి.
- రైతులు పొలాల్లోకి వెళ్లకూడదు. పొలాల్లోకి వెళితే పిడుగుపాటుకు గురయ్యే ప్రమాదం ఉంది. అలాగని చెట్ల కింద కూడా నించోకూడదు. ఎత్తైన చెట్లపై పిడుగులు పడే ప్రమాదం చాలా ఎక్కువ.
- పశువులు, పెంపుడు జంతువులుంటే వాటికి కట్టిన తాడును విప్పి వదిలివేయాలి.
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకూడదు.



అగ్నిమాపకశాఖ సన్నద్ధం

గుంటూరు సిటీ: మొంథా తుఫాన్ నేపథ్యంలో ఎటువంటి అత్యవసర పరిస్థితి సంభవించినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ ఆర్ జ్ఞాన సుందరం తెలిపారు. గుంటూరు-1 అగ్నిమాపక కేంద్రాన్ని ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సందర్భంగా రెస్క్యూ ఎక్విప్‌మెంట్లను పరిశీలించి ప్రమాదం సంభవించినప్పుడు వాటిని ఎలా ఉపయోగించాలనే దానిపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. తుఫాన్ సమయంలో ఎలాంటి ప్రమాద సమాచారం అందినా వెంటనే సిబ్బంది అప్రమత్తమై సంఘటన స్థలానికి చేరుకొని సహాయ సహకారాలు అందించాలని ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో రీజనల్ ఫైర్ ఆఫీసర్ ఎంఏక్యూ జిలానీ, గుంటూరు జిల్లా ఫైర్ ఆఫీసర్ ఎం శ్రీనివాస రెడ్డి, గుంటూర్-1 సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి కె.కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.



గుంటూరు-1 అగ్నిమాపక కేంద్రంలో సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ జ్ఞాన సుందరం, చిత్రంలో రీజనల్ ఫైర్ ఆఫీసర్ జిలాని తదితరులు



అమరావతి : కృష్ణానదిలో స్నానమాచరిస్తున్న భక్తులు

- కృష్ణానదిలో వేలాది మంది భక్తుల పుణ్యస్నానాలు
- భక్తులతో కాకాని మల్లన్న సన్నిధి కిటకిట



పెదకాకాని : మల్లేశ్వరుడి సన్నిధిలో దీపారాధన చేస్తున్న భక్తులు

కార్తీక శోభ

అమరావతి/పెదకాకాని, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి సోమవారం నేపథ్యంలో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అమరావతిలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి చేరుకున్న భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి కార్తీక దీపాలను వెలిగించి నదిలో వదిలారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రాకతో నదీతీరం, క్యూలైన్స్ రద్దీగా మారాయి. పెదకాకాని మల్లన్న సన్నిధి భక్తులతో కిటకిటలాడింది. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దీపారాధన చేసి, పొంగలి నైవేద్యాలుగా చేసుకొని స్వామివారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. క్యూ లైన్‌లో స్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. హైకోర్టు జడ్జి జస్టిస్ సుజాత ఆలయాన్ని దర్శించి పూజలు జరిపించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఉపకమిషనర్ లీలాకుమార్ పర్యవేక్షించారు.



పెదకాకాని శివాలయంలో భక్తుల రద్దీ



అమరావతి : క్యూలో బారులు తీరిన భక్తులు

గుంటూరు మీదుగా ప్రత్యేక రైళ్లు

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నవంబరు నెలలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదుగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే డివిజన్ ప్రజాసంబంధాల అధికారి ఏ.శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబరు 07055 సికింద్రాబాద్-అనకాపల్లి ప్రత్యేక రైలు నవంబరు 6 నుంచి 27వ తేదీ వరకు ప్రతీ గురువారం నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదుగా ప్రయాణిస్తుందని చెప్పారు. రైలు నంబరు 07056 అనకాపల్లి-సికింద్రాబాద్ ప్రత్యేక రైలు నవంబరు 7 నుంచి 28వ తేదీ వరకు ప్రతీ శుక్రవారం ప్రయాణిస్తుందని తెలిపారు. రైలు నంబరు 07033 కాకినాడ టౌన్-మైసూరు ప్రత్యేక రైలు నవంబరు 3 నుంచి 28వ తేదీ వరకు ప్రతి సోమ, శుక్రవారం, రైలు నంబరు 07034 మైసూరు-కాకినాడ టౌన్ స్పెషల్ నవంబరు 4 నుంచి 29వ తేదీ వరకు ప్రతి మంగళ, శనివారాలలో గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదుగా ప్రయాణిస్తుందని, పుట్టపర్తి శ్రీ సత్యసాయిబాబా శతజయంతి సందర్భంగా నవంబరు 13వ తేదీన రైలు నంబరు 07409 అనకాపల్లి-యల్హాంక, నవంబరు 14వ తేదీన యల్హంక-అనకాపల్లి గుంటూరు, నరసరావుపేట, వినుకొండ మీదుగా ప్రయాణిస్తాయని శ్రీధర్ తెలిపారు.

నేడు, రేపు పలు రైళ్లు రద్దు

గుంటూరు/తెనాలి అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను కారణంగా మంగళ, బుధవారాల్లో పలు రైళ్లను రద్దు చేస్తూ రైల్వేశాఖ నిర్ణయం తీసుకుంది. మంగళవారం రైలు నెంబరు 18463 భువనేశ్వర్-బెంగళూరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, రైలు నంబరు 17015 భువనేశ్వర్-సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్, రైలు నంబరు 12806 లింగంపల్లి-విశాఖపట్టణం జన్మభూమి ఎక్స్‌ప్రెస్, రైలు నంబరు 17281 గుంటూరు-నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్, రైలు నంబరు 17016 సికింద్రాబాద్-భువనేశ్వర్ విశాఖ ఎక్స్‌ప్రెస్, రైలు నంబరు 12704 సికింద్రాబాద్-హౌరా ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, రైలు నంబరు 17243 గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్, రైలు నంబరు 07165 హైదరాబాద్-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు. అలాగే ఈ నెల 29 బుధవారం రోజున రైలు నంబరు 17244 రాయగడ-గుంటూరు, రైలు నంబరు 07166 భువనేశ్వర్-హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు. విజయవాడ గూడురు మార్గంలో పలు రైళ్లు రెండు రోజుల పాటు రద్దయ్యాయి. బెజవాడ-తెనాలి, తెనాలి-రేపల్లె, రేపల్లె-తెనాలి, రేపల్లె-గుంటూరు, గుంటూరు-తెనాలి, రేపల్లె-మార్కాపురం, మార్కాపురం-తెనాలి, తెనాలి-గుంటూరు, బెజవాడ-ఒంగోలు, ఒంగోలు-బెజవాడ,గుంటూరు-రేపల్లె, రేపల్లె-గుంటూరు రైళ్లు రద్దయాయి. కాగా టాటా-ఎర్నాకుళం రైలు 18189ను మార్గం మళ్లించారు. విశాఖపట్నం-తిరుపతి, తిరుపతి-విశాఖపట్నం రైళ్లు యథావిధిగా నడుస్తాయని రైల్వే అధికారులు తెలిపారు.

అమరావతి, గుంటూరులో రైల్వే కోచింగ్ టెర్మినల్స్

- రాజధానిలో నిర్మించే ఎయిర్‌పోర్టుకు హైస్పీడ్ రైలు కనెక్టివిటీ
- దక్షిణ మధ్య రైల్వే అధికారులకు సీఎం సూచన

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని, గుంటూరు నగరంలో రైల్వే కోచింగ్ టెర్మినల్స్‌ను ఏర్పాటు చేసేందుకు దక్షిణ మధ్య రైల్వే ముందుకొచ్చింది. దీని వల్ల భవిష్యత్తులో ఈ రెండు ప్రాంతాల నుంచి బయలుదేరే రైళ్ల సంఖ్య పెరగనుంది. అలాగే అమరావతి రాజధానిలో నిర్మించబోయే నూతన రైల్వేస్టేషన్ వినూత్నంగా ఉండేలా చూడాలని సీఎం చంద్రబాబునాయుడు దక్షిణ మధ్య రైల్వే అధికారులకు సూచించారు. రాజధానిలో త్వరలో నిర్మించబోయే అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రతిపాదిత హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ అనుసంధానం చేయాలన్నారు. నడికుడి-శ్రీకాళహస్తి, గుంటూరు-గుంతకల్లు రైలుమార్గాల పెండింగ్ పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ శ్రీవాస్తవ సోమవారం అమరావతికి వచ్చారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు రైల్వే అధికారులతో సమావేశమై నిర్మాణ దశలో ఉన్న ప్రాజెక్టులపై చర్చించారు. గుంటూరు రైల్వే డివిజన్‌కు సంబంధించిన రైల్వే ప్రాజెక్టుల పైనా చర్చ జరిగింది. అమరావతి రాజధాని మీదుగా నంబూరు-ఎర్రుపాలెం నూతన రైలు మార్గం పురోగతిని అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేసి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలన్నారు. అమరావతి రాజధాని భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని అక్కడ నిర్మించబోయే రైల్వేస్టేషన్ వినూత్నంగా ఉండాలన్నారు. రైల్వేశాఖ కోరిన విధంగా కోచింగ్ టెర్మినల్స్‌కు అవసరమైన భూమిని కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రైల్వేశాఖ ప్రతిపాదించిన హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ ఎలైన్‌మెంట్ గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు.

కడలిలోకి.. కృష్ణమ్మ పరుగులు

(5వ పేజీ తరువాయి)

జలాశయంలో 98.04 శాతం మేర నీటి నిల్వ ఉంది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు. సోమవారం డ్యాంలో నీటి నిల్వ 305.92 టీఎంసీలు ఉంది. డ్యాం పూర్తి స్థాయి నీటి నిల్వ 590 అడుగులకు గాను 587.70 అడుగుల నీటి మట్టం ఉంది. జలాశయానికి 37,366 కూసెక్కుల నీటి ప్రవాహం ఉంది. కుడి, ఎడమ కాలువల ద్వారా సాగుకు, విద్యు త్ ఉత్పత్తికి వినియోగిస్తున్న నీటితో కలసి మొత్తం 37,266 కూసెక్కుల నీటిని డ్యాం నుంచి విడుదల చేస్తున్నారు.

'చింత' లేకుండా..

సాగార్జున సాగర్ దిగువన ఉన్న కేఎల్ రావు పులిచింతల జలాశయం కూడా పూర్తి స్థాయి నీటి నిల్వతో తొణికిసలాడుతోంది. ఇది కూడా ఆగస్టులో నిండింది. అప్పటి నుంచి నేటి వరకు పూర్తిస్థాయి నీటి నిల్వ కొన సాగుతోంది. పులిచింతల నీటి నిల్వ సామర్థ్యం 45.77 టిఎంసీలు కాగా 41.63 టీఎంసీల నీటి నిల్వ ఉంది. పూర్తి స్థాయి నీటి మట్టం 175 అడుగులు కాగా 172.27 అడుగుల నీటి మట్టం ఉంది. జలాశయం ఇన్‌ఫ్లో 33,835 క్యూసెక్కులు, ఇక్కడ నుంచి 57,896 కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్, పులిచింతల జలాశయాలు పూర్తిస్థాయి నీటితో తొణికిసలాడుతున్నాయి.

ప్రవాసాంధ్రులకు బీమా పథకం

- విదేశాలకు విద్య, ఉపాధి రీత్యా వెళ్లిన వాళ్లకు లబ్ధి ● మరణించినా, శాశ్వత వైకల్యం పొందినా రూ.10 లక్షల సాయం

ఏటా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి కొన్ని వేల మంది విద్యార్థులు అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, న్యూజిల్యాండ్, రష్యా, ఉక్రెయిన్, చైనా వంటి దేశాల్లో ఎంఎస్, ఎంబీబీఎస్ వంటి కోర్సులు చదువుకునేందుకు వెలుతుంటారు. వీళ్లు కనీసం రూ. 30 లక్షలకుపైగా వెచ్చించి ఆయా దేశాలకు వెలుతుంటారు. అయితే అక్కడ ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే వీళ్లకు ఎలాంటి భరోసా ఉండటం లేదు. కేవలం మెడికల్ ఇన్సూరెన్స్ మాత్రమే లభిస్తుంది. దీనికి కూడా దాదాపు రూ. 2.50 లక్షల వరకు అక్కడ చార్జ్ చేస్తున్నారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు, దుండగుల కాల్పులు వంటి సంఘటనల్లో ఇక్కడి నుంచి వెళ్లిన ప్రవాసాంధ్రులు ప్రాణాలు కోల్పోవడం, తీవ్రంగా గాయపడుతున్న సంఘటనలు జరుగుతున్నాయి. ఎన్నో ఆశలు పెట్టుకొని, అప్పులు చేసి పంపిస్తున్న కుటుంబాలు వారి పిల్లలకు ఏమైనా జరిగితే ఆర్థికంగా చితికిపోతున్నాయి. దీనిని పరిగణనలోకి తీసుకొన్న రాష్ట్ర ప్రభుత్వం ప్రవాసాంధ్ర భరోసా బీమా (పీబీబీ) 2.0 పథకాన్ని తీసుకొచ్చింది.



గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువులు, ఉద్యోగ, ఉపాధి రీత్యా విదేశాలకు వెళ్తున్న వారి ప్రయోజనం కోసం రాష్ట్ర ప్రభుత్వం పీబీబీ 2.0 పథకాన్ని అమలులోకి తీసుకొచ్చింది. దీని వల్ల విదేశాలకు వెళ్లిన వాళ్లకి ఏమైనా జరిగినా ఆర్థిక భరోసా లభిస్తుంది. నామ మాత్రం బీమా ప్రీమియంతో ఈ పథకాన్ని ఏపీ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ప్రభుత్వ రంగ సంస్థ) ద్వారా అమలు చేస్తోంది. రెండు రోజుల క్రితం ఈ పథకాన్ని సీఎం చంద్రబాబునాయుడు లాంఛనంగా ప్రారంభించారు.

విద్యార్థుల కోసం...

విద్యార్థులు ఈ బీమా పథకం కోసం సంవత్సరానికి రూ. 218 ప్రీమియం చెల్లించాలి. ప్రమాదంలో మరణించినా, శాశ్వత అంగవైకల్యం పొందినా రూ. 10 లక్షల ఆర్థికసాయం లభిస్తుంది. ప్రమాదం వలన మరణించిన వారి భౌతికకాయాన్ని స్వదేశానికి తరలించడానికి, అంగవైకల్యం కలిగిన వ్యక్తి స్వదేశానికి వచ్చేందుకు ఒక సహాయకుడితో పాటు సాధారణ తరగతి విమాన చార్జీలు చెల్లిస్తారు. ప్రమాదంలో గాయాలైతే ఆస్పత్రి ఖర్చుల కింద రూ.లక్ష వరకు చెల్లిస్తారు. ప్రమాదానికి గురై చదువు కొనసాగించడానికి అనర్హుడిగా గుర్తిస్తే ఆ వ్యక్తికి, ఒక సహాయకునికి స్వదేశం వచ్చేందుకు విమాన చార్జీలు చెల్లిస్తారు. బీమా పథకం కోసం దరఖాస్తు చేసుకొనేందుకు పాసు పోర్టు మొదటి, ఆఖరి పేజీలు, వీసా/సివిల్‌ఐడీ/ అకామా/ఆఫర్ లెటర్ తప్పనిసరి. పూర్తి వివరాలకు ఏపీఎన్ఆర్ టీఎస్ హెల్ప్‌లైన్ నంబరు 8632340678, వాట్సాప్ నంబరు 8500027678ను సంప్రదించాల్సి ఉంటుంది.

ఉద్యోగులు, వలస కార్మికులకు...

ఉద్యోగులు, వలస కార్మికులు ఈ బీమా పథకంలో చేరాలంటే 18 నుంచి 60 సంవత్సరాల మధ్యన వయస్సు కలిగి ఉండాలి. మూడేళ్లకు రూ. 590 ప్రీమియం చెల్లించాలి. వీళ్లకు కూడా ప్రమాదంలో మరణించినా, శాశ్వత అంగవైకల్యం పొందినా రూ. 10 లక్షల ఆర్థికసాయం, స్వదేశానికి రావడానికి ఒక సహాయకుడితో సాధారణ తరగతి విమాన చార్జీలు చెల్లిస్తారు. ప్రమాదంలో మరణించినా, శాశ్వత అంగవైకల్యం కలిగిన వారి కుటుంబసభ్యులకు ఆస్పత్రి ఖర్చుల కింద బీమా కాలపరిమితి వరకు ఏడాదికి రూ. 50 వేలు చెల్లిస్తారు. ఉద్యోగ సమయంలో కంపెనీ యాజమాన్యంతో ఏదైనా సమస్యలు తలెత్తితే ఆ సమస్యల పరిష్కారానికి న్యాయ ఖర్చుల కింద రూ. 45 వేల వరకు చెల్లిస్తారు. ప్రమాదం వల్ల సంభవించే గాయాలు, అస్వస్థత, తదితరాల చికిత్సకయ్యే ఆస్పత్రి ఖర్చులు కింద రూ.లక్ష వరకు చెల్లిస్తారు.

మహిళలకు ప్రసూతి ఖర్చుల చెల్లింపు

బీమా ఉన్న ప్రవాసాంధ్ర మహిళలకు ప్రసూతి ఖర్చులు చెల్లిస్తారు. బీమా కాలపరిమితిలో సాధారణ ప్రసూతి ఆస్పత్రి ఖర్చుల కింద రూ. 35 వేల వరకు చెల్లిస్తారు. సిజేరియన్ అయితే రూ. 50 వేల వరకు చెల్లింపు చేస్తారు.

దూరవిద్య పీజీ పరీక్ష ఫలితాల విడుదల

ఏఎన్‌యూ అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూర విద్యాకేంద్రం ఈ ఏడాది జూలై, ఆగస్టులో నిర్వహించిన ఎంఏ హిందీ, చరిత్ర కోర్సుల నాలుగు సెమిస్టర్లు, ఎమ్మెస్సీ ఫుడ్ అండ్ న్యూట్రిషన్ కోర్సు ప్రథమ సెమిస్టర్ (రెగ్యులర్, సప్లిమెంటరీ) పరీక్ష ఫలితాలను దూరవిద్య సంచాలకులు ఆచార్య వి.వెంకటేశ్వర్లు సోమవారం విడుదల చేశారు. విద్యార్థులు రీ-వాల్యుయేషన్‌కు వచ్చే నెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రీ-వాల్యుయేషన్‌కు ఒక్కొక్క పేపర్‌కు ఫీజుగా రూ.960లు చెల్లించాలని, పూర్తిచేసిన దరఖాస్తులను వచ్చే నెల 14లోపు వర్సిటీ దూరవిద్య పరీక్షల సమన్వయకర్తకు పంపాలని దూరవిద్య పరీక్షల విభాగం డిప్యూటీ రిజిస్ట్రార్ జైనులాబ్దిన్ తెలిపారు. ఫలితాలు విడుదల కార్యక్రమంలో ఏఆర్ కృష్ణవేణి, ఉద్యోగులు కోదండపాణి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



పరీక్షా ఫలితాలు విడుదల చేస్తున్న దూరవిద్య సంచాలకులు ఆచార్య వెంకటేశ్వర్లు

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

విద్యుత్ సమస్యలపై కంట్రోల్ రూం ఏర్పాటు

తెనాలి అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో పట్టణంతో పాటు డివిజన్‌లో ఎక్కడ విద్యుత్ సమస్యలు తలెత్తిన వెంటనే సమాచారం ఇవ్వాలని ఈఈ ఎ.సత్యనారాయణ కోరారు. పట్టణంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని డివిజన్‌లో వినియోగదారులు 9440817535 నెంబర్‌లో తెలియపరచాలన్నారు. తుఫాన్ గాలులకు విద్యుత్ స్తంభాలు పడిపోయినా, తీగలు తెగిపోయినా విద్యుత్ అంతరాయం ఏర్పడిన తెలియజేయాలని చెప్పారు. ఆయా సబ్ స్టేషన్‌ల పరిధిలో కూడా సిబ్బంది అందుబాటులో ఉంటారని వారి ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వవచ్చునన్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు

తెనాలి అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ గాలులను దృష్టిలో ఉంచుకుని పట్టణంలో చెట్ల కొమ్మలను తొలగించారు. విద్యుత్ తీగలపై గాలులకు పడి తీగలు తెగడంతో పాటు స్తంభాలు దెబ్బతినే అవకాశం ఉన్న ప్రాంతాలను పరిశీలించి మున్సిపల్, విద్యుత్ శాఖాధికారులు సమన్వయంతో చర్యలు తీసుకున్నారు.

పెమ్మరాజుకు భారతజ్యోతి పురస్కారం

● 30న తెనాలిలో ప్రదానం


పెమ్మరాజు దుర్గాకామేశ్వరరావు

తెనాలి అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సమాజ సేవకుడు పెమ్మరాజు దుర్గాకామేశ్వర రావుకు భారత జ్యోతి పురస్కారం ప్రదానం చేయనున్నారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఈ నెల 30న నిర్వహించనున్న కార్యక్రమంలో ఆయనకు పురస్కారం అందజేస్తారు. కుమార్ పంప్స్ ఎండీ కొత్త సుబ్రహ్మణ్యం, డబుల్ హార్స్ ఎండీ మునగాల శ్యాంప్రసాద్ సౌజన్యంతో రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం, తెనాలి ప్రచురణలు సంయుక్తంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయి. శాసన మండలి సభ్యుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగే పురస్కార సభలో సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి బి.సుదర్శనరెడ్డి, సీనియర్ సంపాదకుడు కె.రామచంద్రమూర్తి, విశ్రాంత పోస్టల్ అధికారి కె.సంధ్యారాణి, హైకోర్టు న్యాయవాది ఇంద్రనీల్ పాల్గొంటారు.

12వ వార్డులో పారిశుధ్య పనుల పర్యవేక్షణ

తెనాలి అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 12వ వార్డులో సోమవారం పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ అప్పలనాయుడు పర్యవేక్షించారు. జంపని డ్రెయిన్ వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. డ్రెయిన్‌లో వ్యర్థాలు ఉంటే మురుగు కాల్వల నుంచి నీటి ప్రవాహం అడ్డుకోవడంతో పాటు పట్టణంలోని ప్రధాన వీధులు జలమయం అయ్యే అవకాశాలు ఉన్నాయి. దీంతో డ్రెయిన్‌లో నీటి పారుదలకు ఎలాంటి అవరోధాలు లేకుండా మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది చర్యలు చేపట్టారు. పాత స్వరాజ్ థియేటర్ ఎదుట వీధిలో కాల్వలతో పాటు జంపని డ్రెయిన్ చివర వ్యర్థాల తొలగింపును సక్రమంగా నిర్వహించారని పారిశుధ్య సిబ్బందిని అభినందించారు.

వైసీపీ లీగల్ సెల్ అధ్యక్షుడిగా ప్రేమరాజు

తెనాలి అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ వైసీపీ లీగల్ సెల్ అధ్యక్షుడిగా పిల్లి ప్రేమరాజును నియమించారు. ఈ సందర్భంగా చినరావూరులో సోమవారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా ప్రకాశం రోడ్డులోని పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ, పట్టణంలో పార్టీ బలోపేతం చేసేందుకు న్యాయవాదులు కృషి చేయాలన్నారు. కౌన్సిలర్ కుర్రా సుజాత, వీరయ్య, భూషణం, చంద్రశేఖర్, అజిత్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రేమరాజును కార్యకర్తలు సన్మానించారు.

గూడ్స్ రైలు ఢీకొని కౌలు రైతు మృతి

తెనాలి క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెనాలి-విజయవాడ ప్రధాన రైలు మార్గంలో దుగ్గిరాల-పెదవడ్లపూడి రైల్వే స్టేషన్‌ల మధ్య గూడ్స్ రైలు ఢీకొని సోమవారం కౌలు రైతు మృతి చెందాడు. తెనాలి జీఆర్‌పీ ఎస్‌ఐ జి.వెంకటాద్రి తెలిపిన వివరాల ప్రకారం మంచికలపూడికి చెందిన కౌలు రైతు గౌతమ్‌సూర్య ప్రసన్న ఉదయం 6.30 గంటల సమయంలో గ్రామంలో రైల్వే ట్రాక్ అవతల తాను సాగుచేస్తున్న పొలంను చూసుకోవడానికి వెళ్లాడు. రైల్వే ట్రాక్ దాటుతున్న సమయంలో మూడో నెంబరు ట్రాక్‌పై వస్తున్న గూడ్స్‌ను గమనించకుండా ట్రాక్‌ను దాటడంతో గూడ్స్ రైలు ఢీకొని రైతు మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


కట్టెంపూడి గ్రామం వద్ద కోతకు గురవుతున్న రహదారి

కోతకు గురవుతున్న టీబీ డ్రెయిన్ కట్ట

● వర్షాలతో కట్టెంపూడి- దండమూడి ప్రధాన రహదారికి ముప్పు ● రైతుల్లోనూ ఆందోళన

పొన్నూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కట్టెంపూడి గ్రామం వద్ద తుంగభద్ర డ్రెయిన్ కాలువ కట్ట కోతకు గురవుతూ ప్రమాదకరంగా మారుతోంది. మండల పరిధిలోని కట్టెంపూడి గ్రామం నుంచి దండమూడి గ్రామం వైపు వెళ్లే రహదారిలో తుంగభద్ర డ్రెయిన్ కాలువ కట్టపై రహదారి నిర్మాణం జరిగింది. ఈ రెండు గ్రామాలకు కలుపుతూ నిర్మించిన రహదారి కాల్వ కట్టపై నుంచి నిర్మించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తుంగభద్ర డ్రెయిన్ ఉధృతంగా ప్రవహించడంతో కాల్వ కట్ట కోతకు గురవుతూ రహదారి వరకు కోత ఏర్పడింది. భారీ వర్షాల నేపథ్యంలో డ్రెయిన్ ఉధృతంగా ప్రవహిస్తే కాలువ కట్ట మరింత కోతకు గురై రహదారి కూడా కొట్టుకుపోయే ప్రమాదం ఉందని సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. మురుగునీటి శాఖ అధికారులు తక్షణమే స్పందించి కాల్వ కట్ట కోతకు గురైన ప్రాంతంలో మరమ్మతులు చేపట్టాలని లేకుంటే రహదారికి గండిపడి డ్రెయిన్‌లోని మురుగునీరు సమీప పంట పొలాలను ముంచెత్తితే పెను ప్రమాదం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా

తెనాలి అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణంతో పాటు డివిజన్‌లోని అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో సోమవారం కొలకలూరు, నందివెలుగు గ్రామాల్లో పర్యటించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. జిల్లా ప్రభుత్వ వైద్యశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తుఫాన్‌కు ప్రభావితమయ్యే ప్రాంతాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. తుఫాన్ తీవ్రమయ్యే వరకు వేచి ఉండవద్దని అన్ని ప్రాంతాల్లో అవసరమైన ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొమ్మమూరు కాల్వ వద్ద సంచారజాతుల వారికి పాఠశాలల్లో ఆవాసం కల్పించి ఆహారం, దుప్పట్లు అందించాలని ఆదేశించారు. వారు నివసిస్తున్న ప్రాంతంలో వీధి దీపాలు ఏర్పాటు చేస్తామన్నారు. సబ్ కలెక్టర్ సంజనా సింహా, మున్సిపల్, రెవెన్యూ, పంచాయితీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


షెడ్యూల్ తెగల వారితో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

● కొల్లిపర: మొంథా తుఫాన్ కారణంగా పెనుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. సోమవారం మండల పరిధిలోని కుంచవరం, అత్తోట, చివలూరు, వల్లభాపురం గ్రామాల్లో తెనాలి సబ్‌కలెక్టర్ సంజనసింహా, తహసీల్దార్ సిద్ధార్థతో కలిసి పర్యటించారు. వరి పంట పొలాలను, పంట కాల్వలను పరిశీలించడంతో రైతులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. అత్తోట సమీపంలో పంట పొలాల కాల్వను పలువురు అక్రమించడంతో నీటిపారుదల సక్రమంగా లేదని వర్షాలు సమయంలో పొలాలు మునిగి పోతున్నాయని తెలియజేయడంతో వెంటనే ఇరిగేషన్ అధికారులకు ఆక్రమణలు తొలగించి పూడిక తీయించాలని ఆదేశాలు జారీ చేశారు. వల్లభాపురం వద్ద కాల్వ నుంచి పంటల మునక నివారించేందుకు ఎత్తిపోతల పథకం నిర్మించడం అవసరమని రైతులు కలెక్టర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా తమీమ్ అన్సారియా మాట్లాడుతూ తుఫాన్ కారణంగా గ్రామాల్లో ఎటువంటి సమస్యలు వచ్చినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వర్షాల సమయంలో రైతులు కూడా వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. పంట కాల్వల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ అయితా నాగేశ్వరరావు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ కె. తులసి, జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకటరత్నం, జిల్లా మత్స్య శాఖ అధికారి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలి

● లోతట్టు ప్రాంత వాసులతో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు


పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ రమేష్ బాబు, తహసీల్దార్ జియావుల్ హక్

పొన్నూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలవాసులు పునరావాస కేంద్రాలకు తరలిరావాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు సూచించారు. పొన్నూరు పట్టణంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సోమవారం కమిషనర్ రమేష్ బాబు తహసీల్దార్ జియావుల్ హక్ పరిశీలించారు. ఈ సందర్భంగా పునరావాస కేంద్రాల్లో బాధితులు ఉండేందుకు అవసరమైన ఏర్పాట్లను సిద్ధం చేయాలని సిబ్బందిని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ పొన్నూరు పట్టణంలో నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్, డీవీసీ కాలనీలోని పాఠశాల భవనంలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మొంథా తుఫాన్ ప్రభావం అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భారీవర్షాలు కురవనున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో బలహీన గృహాల్లో ఉండే ప్రజలు తప్పనిసరిగా పునరావాస కేంద్రాలకు తరలిరావాలని ఆదేశించారు. సురక్షిత జీవనం కోసం అవసరమైన యంత్ర సామగ్రిని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు వదంతులు నమ్మకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని సూచించారు. ఇబ్బందులు తలెత్తితే 08643-247737 కంట్రోల్ రూమ్ నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

● చేబ్రోలు: మొంథా తుఫాన్ ప్రభావంతో వచ్చే భారీ వర్షాలు, గాలుల దెబ్బకు ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో చేబ్రోలు అధికారులు చర్యలు చేపడుతున్నారు. మండల తహసీల్దార్ శ్రీనివాసశర్మ స్వయంగా గ్రామాలకు వెళ్లి ప్రజల పరిస్థితిని పరిశీలిస్తున్నారు. మండలంలోని శలపాడు, శేకూరు, వడ్లమూడి, వేజండ్ల గ్రామల్లో పడిపోవడానికి అవకాశం ఉన్న ఇళ్లను గుర్తించి, ఆ ఇళ్లలో నివసిస్తున్న వారిని పునరావాస కేంద్రాలకు వెళ్లాలని కోరారు. తహసీల్దార్‌తో కలిసి మండల స్పెషల్ ఆఫీసర్ ఎ.జయలక్ష్మి, పొన్నూరు రోడ్డులోని కొమ్మమూరు కాలువను పరిశీలించారు. వర్షాల కారణంగా రోడ్డు కోతకు గురైన ప్రదేశాలను పరిశీలించి, మురుగునీటి ప్రవాహం సాఫీగా సాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు ఇచ్చారు. వీరితోపాటు ఎంపీడీవో ఊహారాణి, ఇరిగేషన్ ఏఈ, గ్రామ సిబ్బంది, స్థానిక అధికారులు పాల్గొన్నారు.


కొమ్మమూరు కాలువను పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ ఎ.జయలక్ష్మి, తహసీల్దార్

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవార పూజలు


కార్తీక సోమవార అలంకరణలో తెనాలి రామలింగేశ్వరస్వామి, పార్వతి దేవి, చేబ్రోలు నాగేశ్వరస్వామి ఆలయంలో భక్తుల పూజలు

తెనాలి అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో తొలి సోమవారం పట్టణంలోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆలయాల ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకుని అభిషేకాల్లో పాల్గొన్నారు. గంగానమ్మపేటలోని పాత శివాలయంలో శ్రీపర్వతవర్ధిని సమేత రామేశ్వరస్వామి వార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. దేవదాయ అధికారులు, అర్చకులు పర్యవేక్షించి దర్శనానికి ఏర్పాట్లు చేశారు. రామలింగేశ్వరపేటలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. పినపాడులోని ప్రాచీన పుణ్యక్షేత్రం గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి, బాలాజీరావుపేటలోని అయ్యప్ప ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. చినరావూరు సోమేశ్వరాలయం, మారీసుపేట శివాలయం, పెదరావూరు శివాలయంలో భక్తులు రద్దీ కనిపించింది.

● పొన్నూరు: పొన్నూరు పట్టణ, మండలంలోని శైవాలయాల్లో సోమవారం కార్తీక మాస ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. పొన్నూరు పట్టణంలోని సహస్రలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున సహస్ర లింగేశ్వర స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలోని స్వామివారి పాదుకలు, శివలింగాలకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మహిళలు ఆలయ ప్రాంగణంలో దీపారాధనలు చేసి ఉపవాస దీక్షలు ఆచరించారు. పట్టణంలోని భావనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో కొలువుతీరిన కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం, నిడుబ్రోలు చౌడేశ్వర స్వామి ఆలయం, పాత పొన్నూరు బాలకోటేశ్వర స్వామి ఆలయం తదితర ఆలయాల్లో కార్తీక సోమవార పూజలు నిర్వహించారు.

● చేబ్రోలు: కార్తీకమాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని చేబ్రోలులోని గంగాపార్వతీ సమేత శ్రీ నాగేశ్వస్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ నెలకొంది. తెల్లవారుజాము నుంచే భక్తులు దేవాలయానికి తరలి వచ్చి కార్తీక దీపాలు వెలిగించి, భక్తిభావంతో స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థాన ప్రధాన అర్చకులు సత్యనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ గడువు పెంపు

తెనాలి అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్లు, అనధికార ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకం గడువును ప్రభుత్వం పెంచిందని మున్సిపల్ కమిషనర్ అప్పలనాయుడు తెలిపారు. దరఖాస్తు గడువును మూడు నెలలు అనగా 2026 జనవరి 23 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఈ లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. డైరెక్టర్, టౌన్ ప్లానింగ్, డిప్యూటీ డైరెక్టర్ టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బందితో రెండు రోజుల పాటు పట్టణంలోని నిర్మాణాలను పరిశీలించి నివేదికలు ఇచ్చారన్నారు. ప్రభుత్వం అనుమతులకు విరుద్ధంగా ఆగస్టు 31, 2025 లోగా నిర్మించిన భవనాలకు క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ఉత్తర్వులు జారీ చేయనుందని, ఆ తదుపరి నిర్మించిన భవనాలు క్రమబద్ధీకరణ పరిధిలోకి రావన్నారు.

తుఫాన్ నేపథ్యంలో వరి రైతులకు సూచనలు

చేబ్రోలు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంపై వరి రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో ప్రియదర్శిని సూచించారు. సోమవారం ఆమె పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుఫాన్ కారణంగా పంట నష్టాన్ని తగ్గించేందుకు రైతులు పొలాల్లో నీరు నిలవకుండా బయటకు పంపే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. గాలులకు వరిపంట పడిపోతే దుబ్బులను పైకి లేపి కట్టలుగా కట్టాలని, నీటిని తొలగించిన తర్వాత పంట పునరుత్తేజం కోసం ప్రతి 5సెంట్ల నారుమడికి 1 కిలో యూరియా, 1కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ చల్లాలని సూచించారు. గింజ నాణ్యత కాపాడేందుకు పాలు పోసుకునే దశలో ఉన్న పంటలకు లీటరు నీటికి 1గ్రాము కార్బెండజిమ్ లేదా 2 గ్రాముల కార్బెండజిమ్ మాంకోజెబ్ లేదా 1 మిల్లీ లీటర్ ప్రొపికొనజోల్ మందును పిచికారీ చేయాలని సూచించారు.


పతకాలు సాధించిన కరాటే క్రీడాకారులు

స్వర్ణపురి కరాటే క్రీడాకారులకు 33 పతకాలు

పొన్నూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణానికి చెందిన వైఎస్ఆర్ కరాటే డోజో విద్యార్థులకు కరాటే ఛాంపియన్ షిప్ పోటీలలో 33 పతకాలు లభించినట్లు కరాటే కోచ్ షేక్ మస్తాన్ తెలిపారు. పట్టణంలోని వైఎస్ఆర్ కరాటే డోజో సెంటర్లో సోమవారం క్రీడాకారుల అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ ఆదివారం 16వ అంతర్జాతీయ ఆహ్వాన జపాన్ షిటోరియో కరాటే ఛాంపియన్ షిప్ 2025 పోటీలు మంగళగిరిలో జరిగినట్లు చెప్పారు. ఈ పోటీలకు పొన్నూరు పట్టణాలకు చెందిన డోజో విద్యార్థులు 24మంది పాల్గొన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు వెయ్యి మందికి పైగా పోటీలలో పాల్గొన్నారు. కటా, కుమితే విభాగాలలో పొన్నూరు కరాటే ఫైటర్స్ 24మంది 33 పతకాలు సాధించి ప్రథమ స్థానంలో నిలిచినట్లు చెప్పారు, 16 బంగారు పతకాలు ఎనిమిది రజితాలు, 9 కాంస్య పతకాలు విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. పొన్నూరు కరాటే డోజో ఫైటర్స్ గత కొంతకాలంగా రాష్ట్ర జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారన్నారు. పతకాలు సాధించిన కరాటే ఫైటర్స్‌ను ఆంధ్రప్రదేశ్ స్టేట్ టెక్నికల్ డైరెక్టర్ సీనియర్ కరాటే మాస్టర్ ఎర్ర నాగేశ్వరరావు, తదితరులు అభినందించారు.


మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి

ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి

కొల్లిపర, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కుర్రా విజయలక్ష్మి అన్నారు. సోమవారం మండల పరిధిలోని మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో విజయలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, వైద్యశాలలో ఉన్న మందులను పరిశీలించి ఆరోగ్య సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ తుఫాన్ కారణంగా వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామాల్లో తప్పనిసరిగా మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలన్నారు. ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులు కారణంగా అంటువ్యాధులు వచ్చే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలన్నారు. గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. గర్భిణులు హాస్పటల్‌లోనే ప్రసవించేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి నీహ, పీహెచ్‌ఎన్ సుమతి, ఆరోగ్య విస్తరణాధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న రైతు బజారు

కొనుగోలుదారులతో రైతు బజార్లు కిటకిట

● 11 గంటలకే దుకాణాలు ఖాళీ

తెనాలి అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో పట్టణంలోని రైతు బజార్లు కిటకిటలాడాయి. రైతు బజార్లలోని కూరగాయలు కొనుగోలు చేసేందుకు పెద్దఎత్తున జనం తరలిరావడంతో 11 గంటలకే దుకాణాలు ఖాళీ అయ్యాయి. రెండు మూడు రోజుల పాటు అవసరమైన కూరగాయలు, సరుకులు, పాలు సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పడంతో కొనుగోలుదారులు తరలివచ్చారు. దీంతో బుర్రిపాలెం రోడ్డులోని రైతు బజారు, బోసు రోడ్డులోని రైతు బజారు కూరగాయలు మొత్తం కొనేశారు. రైతు బజార్లలోని దుకాణాలకు ఉదయం మాత్రమే అన్నిరకాల కూరగాయలు చేరుతాయి. మొత్తం కూరగాయలు కొనేయడంతో మధ్యాహ్నం నుంచి దుకాణాలను మూసి వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.


రహదారుల నిర్మాణానికి కొబ్బరికాయ కొడుతున్న చైర్ పర్సన్ రాధిక

రహదారులు, కాల్వల అభివృద్ధికి చర్యలు

● చైర్‌పర్సన్ రాధిక

తెనాలి అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్ని రహదారులు, మురుగు కాల్వల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 35, 36, 37 వార్డులలో సోమవారం సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాల్వల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.97.30 లక్షలతో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను కోరారు. పట్టణ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ముఖ్యంగా రహదారులు లేని ప్రాంతాలకు తగిన ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కౌన్సిలర్ గొడవర్తి హరేరామ్, బ్రహ్మేశ్వరరావు, రాముని రేష్, డీఈ శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

తమిళనాడు మర్కంటైల్ బ్యాంకు శాఖ ప్రారంభం


బ్యాంకును ప్రారంభిస్తున్న డబుల్ హార్స్ సంస్థ ఎండీ శ్యాంప్రసాద్

తెనాలి అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేటలో ఏర్పాటుచేసిన తమిళనాడు మర్కంటైల్ బ్యాంకు శాఖను డబుల్ హార్స్ సంస్థ ఎండీ మునగాల మోహనశ్యాంప్రసాద్ ప్రారంభించారు. నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాంకు 598వ శాఖలో కరెన్సీ చెస్ట్‌ను తిరుమల కాటన్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ పట్టాభి రామకోటేశ్వరరావు ప్రారంభించారు. డాక్టర్ తాడిబోయిన అవినాష్ కరెన్సీ వాల్ట్‌లో నగదు నింపగా డాక్టర్ తాడిబోయిన అనూష జ్యోతి వెలిగించారు. బ్రాంచ్ మేనేజర్ కె.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, 1921లో తమిళనాడులోని తూత్‌కుడిలో బ్యాంకు ప్రారంభం అయ్యిందని గత సెప్టెంబరు నాటికి లక్ష కోట్ల వార్షిక టర్నోవర్‌కు చేరిందన్నారు. దేశమంతటా సేవలు అందిస్తున్న బ్యాంకు సేవలను తెనాలి ప్రాంత ప్రజలు కూడా వినియోగించుకోవాలని కోరారు. డాల్‌మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు నంబూరు కృష్ణమూర్తి, రీజనల్ మేనేజర్ పరనీతరన్ పాల్గొన్నారు.

హౌసింగ్ కాలనీలో మౌలిక వసతులపై డీటీకి వినతి

కొల్లిపర, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపర శివారు గుడిబండివారిపాలెం హౌసింగ్ కాలనీలో మౌలిక వసతులు కల్పించి, రోడ్లు వేయాలని కాలనీ వాసులు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ రాజేష్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. వర్షాలు పడినప్పుడు గృహాల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో సీపీఎం తెనాలి రూరల్ కార్యదర్శి ములకా శివసాంబిరెడ్డి, తిరుపతమ్మ, శ్రీలత, దుర్గాభవాని, రెహానా, వెంకటసుబ్బయ్య, గోపాలకృష్ణ, వెంకటేష్, ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

దుగ్గిరాలయార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల యార్డులో సోమవారం జరిగిన వేలంలో 616 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ. 11,300, గరిష్ఠ ధర రూ. 11.881, మోడల్ ధర రూ.11,661 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.10.900, గరిష్ఠ ధర రూ.11,800, మోడల్ ధర రూ. 11,661 పలికాయి.

తాడికొండ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా ధనలక్ష్మి


ధనలక్ష్మి

తాడికొండ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తాడికొండ మండలం ముక్కామల గ్రామానికి చెందిన నీలాల కృష్ణారావు సతీమణి ధనలక్ష్మిని తాడికొండ మార్కెట్ యార్డు కమిటీ చైర్‌పర్సన్‌గా ప్రభుత్వం నియమించింది.20 మందితో కూడిన కమిటీని విడుదల చేసింది. గౌరవ అధ్యక్షులుగా తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ఉండనున్నారు. వైస్‌చైర్మన్‌గా చిలుకూరి వెంకటరెడ్డి, కమిటీ మెంబర్లుగా మల్లవరపు ఇమ్మానియేలు, షేక్ మొహినుద్దీన్, కంపా నాగలక్ష్మీ తిరుపతమ్మ, మాదాసు మాణిక్యరావు, కర్నాటి శివపార్వతి, మద్దినేని వెంకట నరేష్, కొండవీటి పద్మావతి, మట్టుకొయ్య సుజాత, బేతు సురేంద్రబాబు, బుల్లా కల్పన, మంచికలపూడి రమాదేవి, జెట్టి రాంబాబు, గుమ్మడిదల ఏడుకొండలు సభ్యులుగా నియమించారు. తాడికొండ సర్పంచ్, తాడికొండ పీఏసీఎస్, అసిస్టెంట్ డైరెక్టర్ అఫ్ యానిమల్ హస్‌బెండరి, జిల్లా అగ్రికల్చర్ మార్కెటింగ్‌శాఖ అధికారులు కమిటీ మెంబర్లుగా ఉంటారు.

ఈవోపీఆర్డీగా రామకృష్ణ



పెదనందిపాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పెదనందిపాడు మండల ఈవోపీఆర్డీగా జి.రామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పొన్నూరు మండలం మామిళ్లపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన రామకృష్ణ పదోన్నతి పొంది పెదనందిపాడుకు ఈవోపీఆర్డీగా విచ్చేశారు. రామకృష్ణను మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలసి అభినందనలు తెలియజేశారు.

రోడ్డు నిర్మించాలని కలెక్టర్‌కు వినతి

దుగ్గిరాల, అక్టోబరు 27: మండలంలోని కరకట్ట గ్రామాలైన పెదకొండూరు, గొడవర్రు మధ్య గత కొన్ని దశాబ్దాలుగా నిర్మాణానికి నోచుకోని రోడ్డు నిర్మాణం చేపట్టాలని, గ్రామస్థులు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు విజ్ఞప్తి చేశారు. తుఫాన్ ప్రభావం అధికంగా ఉంటుందని భావిస్తున్న పలుచోట్ల జరిపిన పర్యటనలో భాగంగా కలెక్టర్ కరకట్ట మీదుగా వెళుతుండగా గ్రామస్థులు కలెక్టర్‌ను కలిసి 650మీటర్ల రోడ్డునిర్మాణం పనులు చేయించాలని కోరారు. దీనిపై కలెక్టర్ అన్సారియా స్పందించి వీలైనంత త్వరగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు.

ఆటోకు నిప్పు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు వ్యక్తులు ఆటోకు నిప్పుపెట్టిన ఘటన తాడేపల్లి పట్టణంలోని మహానాడులో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. ఇళ్ల మధ్య ఆటో తగలబడుతూ పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. సీఐ వీరేంద్రబాబు కథనం ప్రకారం, స్థానికంగా ఆటో నడుపుకునే అఖిల్ అనే యువకుడు అందరితో చనువుగా ఉంటూ కలుపుగోలుగా ఉంటాడు. దీన్ని అదే ప్రాంతానికి చెందిన సయ్యద్ మీరా హమీద్, మాలిక్ సమ్మర్, జెట్టి కాటమరాజు జీర్ణించుకోలేకపోయారు. అఖిల్ ఎలాగైనా నష్టపెట్టాలని భావించి ఆదివారం రాత్రి అందరూ నిద్రలో ఉండగా అఖిల్ ఆటోపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఈ ఘటనలో ఆటో పూర్తిగా కాలిపోయింది. బాధితుడు తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు రెండు బృందాలుగా ఏర్పాడి ఘటన జరిగిన పది గంటల లోపే నిందితులను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశారు.

వచ్చే నెలలో సీఐటీయూ జిల్లా మహాసభలు

తాడేపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నవంబరు 23, 24వ తేదీలలో తాడేపల్లిలో జరిగనున్న సీఐటియూ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటియూ తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ కోరారు. సోమవారం సాయంత్రం ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి పాతూరు క్రాస్ రోడ్ వద్ద ఆటోకార్మికులను కలిసి మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా కార్మిక రంగాన్ని నిర్వీర్యం చేసే దిశగా కార్మిక చట్టాలను బీజేపీ తీసుకొచ్చిందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం దుర్మార్గమని, వాటిని రద్దు చేయాలని సీఐటీయూ డిమాండ్ చేస్తోందన్నారు. డ్రైవర్లపై ఉరితాళ్లుగా ఉన్న మోటారు వెహికల్ చట్టాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు సంకురు జోసఫ్‌రాజు, ఆనంద్, భరత్, శ్రీనివాసరావు, వాసు, జాన్సన్, సుశీలరావు, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

29న జాబ్ మేళా

తుళ్లూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, శిక్షణశాఖ ఆధ్వర్యంలో ఏపీ సీఆర్డీఏ సౌజన్యంతో ఈ నెల 29న తుళ్లూరులోని సీఆర్డీఏ స్కిల్ హబ్ కేంద్రంలో జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని సీఆర్డీఏ కార్యాలయ అధికారులు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, బీటెక్, ఏదైనా డిగ్రీ, పీజీ చదివి 18 నుంచి 40 ఏళ్లలోపు వయస్సు కలిగిన అభ్యర్థులు హాజరు కావొచ్చని చెప్పారు. జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు రూ.12,000 నుంచి రూ. 25,000 వరకు వేతనం లభిస్తుందని తెలిపారు. జాబ్ మేళాకు సంబంధించిన పూర్తి వివరాలకు 9963425999 నంబరుకు సంప్రదించాలని కోరారు.

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

● మంగళగిరిలో పునరావాస కేంద్రాల ఏర్పాటు
● కొండ ప్రాంతంలో అప్రమత్తంగా ఉండాలని సూచన


మంగళగిరి కొత్తపేట కొండ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా, అధికారులు

మంగళగిరి సిటీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా సోమవారం పరిశీలించారు. మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, పట్టణంలోని వీవర్స్ కాలనీ మునిసిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. సంచార జీవనం సాగిస్తున్న వారిని తాత్కాలిక గుడారాలు, ప్రమాదకరంగా ఉన్న నిర్మాణాలలో నివసిస్తున్న వారిని పునరావాస కేంద్రాలకు తరలిస్తామని చెప్పారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, వసతి, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. నీరుకొండ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ వద్ద గతంలో నీటి ప్రవాహం వచ్చిన దృష్ట్యా ఆ ప్రాంతంపై దృష్టి సారించాలని, అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మంగళగిరి కొత్తపేటలో గతంలో కురిసిన వర్షాలకు కొండ చరియలు విరిగిపడి ఓ వృద్ధురాలు మృతిచెందిన ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా మాట్లాడుతూ, కొత్తపేట కొండ దిగువన ఉన్న 84 కుటుంబాలను పునరావాస కేంద్రానికి తరలిస్తున్నట్టు చెప్పారు. కలెక్టర్ వెంట తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహా, వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ అయితా నాగేశ్వరరావు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు కె.తులసి, జలవనరులశాఖ పర్యవేక్షక ఇంజనీరు వెంకటరత్నం, మత్స్యశాఖ జిల్లా అధికారి పీఎస్ కిరణ్‌కుమార్, మంగళగిరి తహసీల్దారు దినేష్ రాఘవేంద్ర తదితరులు ఉన్నారు.

మొంథా తుపాను తీవ్రత అధికంగా ఉంటుందన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. నగరపాలక సంస్థ, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, పోలీసు శాఖల అధికారులు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. నగరపాలకసంస్థ పరిధిలో పునరావాసకేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా తెలిపారు. తుపాను ప్రభావం సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు. తహసీల్దారు దినేష్ రాఘవేంద్ర, మంగళగిరి రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ చినకాకాని గ్రామంలోని దీనదయాళ్ నగర్‌ను పరిశీలించారు. మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండలాల్లో మొత్తం 21 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. 2వేల మంది బాధితులకు వసతి, భోజనం, మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకున్నామని వివరించారు.

పునరావాస కేంద్రాలకు ప్రజల తరలింపు


దుగ్గిరాల చెన్నకేశనగర్ వాసులను పునరావాస కేంద్రాలకు తరలించే ఏర్పాట్లపై చర్చిస్తున్న అధికారులు

దుగ్గిరాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో అతిభారీ వర్షాలు కురుస్తాయన్న సమాచారం నేపథ్యంలో పల్లపు ప్రదేశాల్లో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని మండల ప్రత్యేక అధికారి టి.నరసింహారెడ్డి చెప్పారు. తహసీల్దార్ ఐ.సునీత, ఎంపీడీవో శ్రీనివాసరావు ఇతర అధికారులు, టీడీపీ నాయకులతో కలిసి చెన్నకేశవనగర్, చిలువూరు గ్రామాల్లో పర్యటించి పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి నష్టం జరుగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. మైక్‌ల ద్వారా అనౌన్స్‌మెంట్ చేసినట్లు చెప్పారు. గతంలో అధికవర్షాలతో ముంపుబారిన పడిన, చెన్నకేశవనగర్, ఈమని, పెదకొండూరు చిలువూరు గ్రామాల్లో పలు కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. పునరావాస కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని చెప్పారు. అత్యవసర వైద్యశిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టీడీపీ వాణిజ్య విభాగ ప్రధానకార్యదర్శి గూడూరు వెంకట్రావు, సర్పంచ్ మేఘావత్ కుషీబాయి, వెంకటేశ్వరనాయక్, శంకర్‌నాయక్, డిప్యూటీ ఎంపీడీవో జవహర్‌లాల్, ఏపీఎం సురేష్‌కుమార్, ఈవో కె.వివేకానంద, పీహెచ్‌సీ డాక్టర్ అబ్దుల్‌రహ్మాన్, హెల్త్‌ఎడ్యుకేటర్ వంకదార సుబ్బారావు వీఆర్‌వోలు జయకాంత్, అనిల్‌వర్మ పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు అధైర్యపడొద్దు

దుగ్గిరాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని దుగ్గిరాల యార్డు చైర్‌పర్సన్ ఝాన్సీరాణి అన్నారు. వారికి చెందిన 2వేల బస్తాల పసుపును సురక్షితంగా ఉంచామని చెప్పారు. రైతులకు ఏ విధమైన సహాయం కావాలన్నా మార్కెట్ యార్డు సిబ్బంది చేసేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కాగా, మొంథా తుఫాన్ కారణంగా మంగళ, బుధవారాలు రెండ్రోజులపాటు యార్డుకు సెలవులు ప్రకటించినట్లు ప్రత్యేకశ్రేణి కార్యదర్శి జేవీ సుబ్బారావు తెలిపారు.

● దూసుకొస్తున్న మొంథా తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు సంబంధిత ప్రభుత్వశాఖల అధికారులందరూ సిద్ధంగా ఉన్నారని డీఎల్‌డీవో కుసుమ శ్రీదేవి పేర్కొన్నారు. వర్షాలు కురిశాక పారిశుధ్యం సమస్యలు లేకుండా చూస్తున్నామని, మురుగుకాల్వలు పూడికలు తీయించడం, జబ్బులు వ్యాపించకుండా వీధుల్లో బ్లీచింగ్ చల్లించడం వంటి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. తుఫాన్ ప్రభావం అధికంగా ఉంటుందని భావిస్తున్న గ్రామాల్లో ప్రజలకు అన్నివిధాల సహాయ సహకారాలు అందించేందుకు, పంచాయతీరాజ్ అధికారులు అందుబాటులో ఉంటారని చెప్పారు.


పెదనందిపాడులో ప్రజలతో మాట్లాడుతున్న జేసీ శ్రీవాస్తవ

సమస్యాత్మక ప్రాంతాల్లో జేసీ పర్యటన

● అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు

తాడికొండ, ప్రత్తిపాడు, పెదనందిపాడు, పెదకాకాని, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను దృష్ట్యా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పెదకాకాని, తాడికొండ, ప్రత్తిపాడు, పెదనందిపాడు మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా సమస్యాత్మక ప్రాంతాలను అడిగి తెలుసుకొని అక్కడికి వెళ్లి పరిస్థితిని గమనించారు. సాగునీటి కాలువలు, డ్రెయిన్లకు గండ్లు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పలుచోట్ల ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను కూడా సందర్శించారు. అక్కడ తలదాచుకొంటున్న ప్రజల సౌకర్యాలను అడిగి తెలుసుకొన్నారు. అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని తహసీల్దార్లను ఆదేశించారు. లోలెవల్ చప్టాల వద్ద గస్తీ ఏర్పాటు చేయాలని సూచించారు. పంటనష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.

సిబ్బంది గ్రామాలలో అందుబాటులో ఉండాలి: ఏవో

పెదనందిపాడు, అక్టోబరు 27: మొంథా తుఫాన్ తీరం దాటే సమయంలో తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని, సిబ్బంది గ్రామాలలో అందుబాటులో ఉండాలని ఏవో సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు అందజేయాలని పల్లపు ప్రాంతాలలో నీరు నిలిచే ప్రమాదం ఉందని వాటిని బయటకు పంపే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు.


తాడికొండలో పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ

తుఫాన్‌తో అధికారుల అప్రమత్తం

కాకుమాను, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు మండల అధికారులు అప్రమత్తమయ్యారు. మండల కేంద్రమైన కాకుమానులో కంట్రోల్ రూంను తహసీల్దార్ వెంకటస్వామి ఏర్పాటుచేసి ప్రత్యేకంగా 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా సిబ్బందిని ఉంచారు. విద్యుత్, ఆర్‌అండ్‌బీ, వ్యవసాయ, పంచాయతీ, రెవెన్యూ శాఖలు ప్రజలకు అందుబాటు ఉండాలని ఇప్పటికే మండల ప్రత్యేక అధికారి ఆంజనేయులు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. మండలంలో ఇప్పటికే వాగు కట్టల మీద నివశించే వారును పునరావాస కేంద్రాలకు తరలించే పనిలో నిమగ్నమయ్యారు. కాగా, మొంథా తుఫాన్ రైతుల్లో ఆందోళన రేకెత్తిస్తుంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మండలంలో సుమారు 33 వేల ఎకరాలలో వరి సాగు చేశారు. మరో నెల రోజుల నుంచి 45 రోజలలోపు చేతికి వచ్చే సమయం ఉన్న దశలో తుఫాన్ ప్రభావంతో పంట దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు వాపోతున్నారు. వరి పైరు కీలక దశలో ఉన్న నేపథ్యంలో తుఫాన్ ప్రభావంతో ఈదురు గాలులు వీస్తే పైరు పడిపోయి గింజ పాలు పోసుకోదని ఆందోళన చెందుతున్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు


కొండవీటి మేజరు కాలువకు సైఫన్ వద్ద అడ్డుగా ఉన్న మెరకను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

ఫిరంగిపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో, ఎంపీడీవో కార్యాలయంలో రెండు చోట్ల కమాండ్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామని తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఎంపీడీవో పి.శివ సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. తుఫాన్ కారణంగా ఎలాంటి అసౌకర్యం కలిగినా 9989973148, 9908260559 నెంబర్లకు వెంటనే కాల్ చేసి సహాయక చర్యలు పొందాలని సూచించారు. మండలంలో లోతట్టు ప్రాంతాల్లోలో లెవల్ బ్రిడ్జిల వద్ద, ఆర్‌యూబీల వద్ద రెవెన్యూ, గ్రామ కార్యదర్శులను, సచివాలయ సిబ్బందిని కాపలాగా ఉంచామన్నారు. ప్రభుత్వం ఇచ్చే సమాచారాన్ని మాత్రమే నమ్మాలని కోరారు. తుఫాన్ కారణంగా కొండవీటి మేజరు కాలువకు గండ్లు పడకుండా గతంలో ఉన్న గండ్లను పూడ్చి వేశామని, 1/6వ మైలు వద్ద ఉన్న సైఫన్ దగ్గరలో అడ్డకట్ట ఉంటే వాటిని జేసీబీతో తొలగింపచేశామన్నారు. ప్రవాహం ఎక్కువై గండ్లు పడితే ఇసుక బస్తాలు రెడీ చేశామని అయన తెలిపారు. కొండవీటి మేజరు కాలువకు సగానికి పైగా ప్రవాహాన్ని తగ్గించామని ఆయన చెప్పారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన

మేడికొండూరు అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ముందస్తు చర్యల్లో భాగంగా మేడికొండూరు మండలం పేరేచర్ల ప్రాంతంలో ముంపునకు గురయ్యే ప్రాంతాలను జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) బివి.నాగసాయికుమార్ సోమవారం పరిశీలించారు. అందులో భాగంగా ఆరవ మైలు కాలనీ వద్ద వరద ప్రవాహానికి అడ్డుగా ఉన్న ఆక్రమణలను తొలగించారు. ఇళ్లలోకి నీరు వచ్చే అవకాశం ఉన్న ప్రాంతాలలో జేసీబీలతో కాలవలు తవ్వించారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మేడికొండూరు తహసీల్దార్ రాఘవరావు లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేశారు. డీపీవో వెంట పేరేచర్ల పంచాయతీ కార్యదర్శి రామారావు, వీఆర్వో వెంకటేష్ తదితరులున్నారు.


పేరేచర్ల 6వ మైలు కాలనీ కాల్వలను పరిశీలిస్తున్న డీపీఓ నాగసాయి కుమార్

పర్యావరణ హితానికి మొక్కలు దోహదం

మంగళగిరి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదం చేస్తాయని, ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని ఎర్రబాలెం ఇండస్ట్రియల్ పార్కు అసోసియేషన్ అధ్యక్షుడు సరికొండ రామరాజు కోరారు. ఏపీ ఇండస్ట్రీస్ పార్ట్‌నర్‌షిప్‌లో భాగంగా సోమవారం ఎర్రబాలెం పారిశ్రామికవాడలో మొక్కలు నాటారు. రాష్ట్రవ్యాప్తంగా ఏపీఐసీ ఆధ్వర్యంలో మొక్కలు నాటుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్రప్రదేశ్ ప్లాస్టిక్ మానుఫాక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.కోటేశ్వరరావు, ఎర్రబాలెం అసోసియేషన్ కార్యదర్శి సీతారామశర్మ, రాధిక, బాలాజీ, రవీంద్ర, బిల్ కలెక్టర్ దాసు తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

అగ్నిమాపక సిబ్బందికి ఈత శిక్షణ పూర్తి

తాడేపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లిలోని ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వద్ద 15మంది అగ్నిమాపక శాఖ సిబ్బంది అధునాతన ఈత శిక్షణను పూర్తి చేసుకుని అధికారుల ముందు సోమవారం డెమో నిర్వహించారు. ప్రాణ రక్షణ, స్కూబా డైవింగ్, రక్షణ నైపుణ్యాల శిక్షణను నెల రోజులపాటు కృష్ణానదిలో విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. సోమవారం నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ డీజీ పి.వెంకటరమణ పాల్గొని శిక్షణ పూర్తి చేసుకున్న ట్రైనీలకు ప్రశంసా పత్రాలు అందించారు. స్విమ్మింగ్ ట్రైనర్ రహీంఖాన్ ఆధ్వర్యంలో 15మంది సిబ్బంది ఈ శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా డీజీ మాట్లాడుతూ, ప్రజల ప్రాణాలు కాపాడేందుకు మరిన్ని మెళకువలు తెలుసుకుని ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖలోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


శిక్షణ పూర్తి చేసుకున్న సిబ్బందికి సర్టిఫికెట్లు అందజేస్తున్న అగ్నిమాపకశాఖ డీజీ వెంకటరమణ

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

● మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు


మంగళగిరి శివాలయంలో కార్తీక దీపారాధన చేస్తున్న మహిళలు

మంగళగిరి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం తొలి సోమవారం కావడంతో మంగళగిరి పట్టణంతోపాటు మండలంలోని శైవ క్షేత్రాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. మంగళగిరి పట్టణంలోని మల్లేశ్వరస్వామి దేవస్థానానికి సోమవారం వేకువజాము మూడు గంటల నుంచే భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. మహిళలు రోజంతా ఉపవాస దీక్షను ఆచరించి భక్తిశ్రద్ధలతో పరమ శివుడ్ని పూజించారు. శివాలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. శివాలయం ప్రధాన అర్చకుడు తెలిదేవరపల్లి మహేష్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, భక్తులకు ఆశీర్వచనాలను అందజేశారు. స్థానిక శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం, ఘాట్‌రోడ్డులోని శ్రీ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో రద్దీగా కనిపించాయి.

భక్తులతో శివాలయాలు కళకళ

దుగ్గిరాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న శివాలయాలు భక్తులతో కళకళలాడాయి. కార్తీకమాసం మొదటి సోమవారం కావడంతో మహిళలు, భక్తులు, అయ్యప్ప దీక్షాపరులు ఉదయాన్నే ఆలయానికి చేరుకున్నారు. మట్టి ప్రమిదల్లో దీపాలను వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. శివాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.


ఆలయాలలో ప్రత్యేక పూజలు

పెదనందిపాడు, అక్టోబరు 27: మండల పరిధిలోని ఆయా గ్రామాలలో సోమేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక శోభ సంతరించుకుంది. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకుని పూజలు చేశారు. అర్చకస్వాములు స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలతో పాటు విశేష పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు.

● కాకుమాను, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా శివాలయాలకు భక్తులు పోటెత్తారు. కొమ్మూరులోని అగస్త్యేశ్వర స్వామి దేవాలయానికి భక్తులు వేకువజాము నుంచే తరలి వచ్చి, నదీ స్నానాలను ఆచరించి కార్తీక దీపారాధన చేశారు. అనంతరం ఆలయంలో కొలువై ఉన్న స్వామి వారికి అభిషేకాలు జరిపారు. కాకుమానులో ఉన్న అగస్త్యేశ్వర స్వామి ఆలయం, కొండపాటూరులో చిన్నమల్లేశ్వర స్వామి ఆలయం, గార్లపాడులో మల్లేశ్వర స్వామి ఆలయం, రేటూరులో రామలింగేశ్వర స్వామి ఆలయం, అమరామృతేశ్వరి సమేత అమర లింగేశ్వర స్వామి ఆలయం, బోడిపాలెంలో ఉన్న శివాలయం కార్తీక శోభను సంతరించుకున్నాయి.

కర్ర సాము కళాకారుడికి ఆర్థిక సాయం

మేడికొండూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రాచీన కళలకు జీవం పోస్తున్న కర్రసాము కళాకారుడు ఖరీదు సాంబయ్య (చంటి)కు హైదరాబాద్‌కు చెందిన సిరి సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.లక్ష ఆర్థిక సాయం అందజేసింది. గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలానికి చెందిన ఖరీదు సాంబయ్య కర్రసాములో ప్రావీణ్యతను సాధించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించారు. తన సొంత భూమిలో శిక్షణశాల ఏర్పాటుచేసి బాల, బాలికలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. శిక్షణశాలకు అవసరమైన షెడ్డు నిర్మించుకోవడానికి పలువురిని ఆర్థిక సాయం కోరారు. దీనికి స్పందించిన సిరి సీడ్స్ సంస్థ సాయం అందజేసింది. సంస్థ అందజేసిన చెక్కును తాడికొండ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ చేతుల మీదుగా సోమవారం సాంబయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిరి సీడ్స్ ఏపి మార్కెటింగ్ మేనేజర్ గంగా చంద్ర, ఫిరంగిపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్నె శ్రీనివాసరావు, మండల టిడిపి నాయకులు కొత్తపల్లి కోటేశ్వరరావు, మండవ చిన నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.


కర్ర సాము కళాకారుడికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రావణ కుమార్


కార్తీక సోమవారం సందర్భంగా గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో ఆహారం పంపిణీ చేస్తున్న ఉప్పుటూరి చినరాములు

రోడ్డు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలి: సీపీఎం

తుళ్లూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పెదపరిమి నుంచి రాయపూడి వరకు భారీ గుంతలు పడ్డ రాజధాని రోడ్డు నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి డిమాండ్ చేశారు. సోమవారం నేతలు రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ, గుంటూరు నుంచి తుళ్లూరు వచ్చే రాజధాని రహదారిపై పెదపరిమి నుంచి రాయపూడి వరకు భారీగా గుంతలు పడి ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి చేతులు దులిపేసుకోవడం సరైంది కాదని అన్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని రవి కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాజధాని డివిజన్ నాయకులు జొన్నకూటి నవీన్ ప్రకాష్ పేరం బాబురావు తదితరులు పాల్గొన్నారు.


గుంటూరు-తుళ్లూరు ప్రధాన రహదారిపై గోతులను పరిశీలిస్తున్న సీపీఎం రాజధాని నేతలు

రాజధానిలో కోస్టల్ ఏరియా బ్యాంక్

తుళ్లూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్ అమరావతిలోని ఉద్ధండరాయునిపాలెం గ్రామంలో తమ ప్రాంతీయ కార్యాలయాన్ని నిర్మించనుంది. ఈ మేరకు సంబంధిత అగ్రిమెంట్‌ను సోమవారం బ్యాంక్ అధికారులు పూర్తి చేశారు. కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ బి.వేణు గోపాల్ రెడ్డి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ పమ్మి హేమంత్ కుమార్‌లకు, సీఆర్డీఏ ఎస్టేట్స్ విభాగ జాయింట్ డైరెక్టర్ వి.డేవిడ్ రాజు సంబంధిత అగ్రిమెంట్‌ను సీఆర్డీఏ కార్యాలయంలో అందజేశారు. అమరావతిలో కార్యాలయ నిర్మాణంతో పాటు తమ కార్యకలాపాల నిర్వహణకు కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్ రాజధానిలో సుమారు రూ.20 కోట్ల పైబడి పెట్టుబడి పెట్టనున్నట్లు పేర్కొంది. తమ కార్యకలాపాల నిర్వహణతో 290 మందికి ఉపాధి కల్పిస్తామని కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ స్పష్టం చేసింది.


కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంకు అధికారులకు అగ్రిమెంటు పత్రాన్ని అందజేస్తున్న సీఆర్డీఏ ఎస్టేట్ జేడీ డేవిడ్ రాజు